
పంచాయతీ ఎన్నికలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. తేదీ ఎప్పుడు ప్రకటించినా ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ప్రభుత్వం ఫిబ్రవరి చివరిలోగా ఎన్నికలను పూర్తి చేయాలని యోచిస్తున్న నేపథ్యంలో దానికి అనుగుణంగా సరంజామాను సిద్ధం చేశారు. ఇటీవలే నిర్వహించిన ఇంటింటి సర్వే ఆధారంగా రిజర్వేషన్ల ప్రక్రియను ప్రకటించాల్సి ఉంది.



పంచాయతీ పోరుకు సిద్ధం

- పూర్తయిన బ్యాలెట్ పేపర్ల ముద్రణ
- గోదాములో భద్రం
- 3,146 బ్యాలెట్ బాక్సుల సిద్ధం
- కొత్తగా 15 పంచాయతీల ఏర్పాటు

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం 589 గ్రామపంచాయతీలు ఉండగా వీటి నుంచి కొత్తగా మరో 15 పంచాయతీల కోసం ప్రతిపాదనలు పంపించారు. వీటిని ఆమోదిస్తే కొత్త వాటితో పాటు విడిపోయిన పంచాయతీల్లో కూడా వార్డుల విభజన, రిజర్వేషన్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు సమయం పట్టే ఆస్కారం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే జిల్లాకు చేరిన ఎన్నికల నిర్వహణ సామగ్రిని భద్రపరిచారు. 3,146 పెద్దబ్యాలెట్ పెట్టెలు, వీటిలో 825 సాధారణ బ్యాలెట్ పెట్టెలను మరమ్మతులు పూర్తిచేసి సిద్ధంగా ఉంచారు. మొత్తం 5,438 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 12అంశాలకు సంబంధించి జిల్లా అధికారులకు నోడల్ అధికారులుగా బాధ్యతలు అప్పగించారు.

9.51 లక్షల బ్యాలెట్ పత్రాల ముద్రణ

గ్రామపంచాయతీ ఓటర్ల తుది జాబితాను అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఎన్నికలకు కావాల్సిన సామగ్రిని సిద్ధం చేశారు. సర్పంచ్‌కి పింక్ బ్యాలెట్ పేపర్, వార్డుకు తెల్ల బ్యాలెట్ పేపర్‌ను వినియోగించనున్నారు. 9లక్షల 51,500 తెలుపు, పింక్ బ్యాలెట్ పత్రాలను ఇప్పటికే ముద్రించి సిద్ధం చేశారు. వార్డు సభ్యులకు ఎన్నికల గుర్తులను కేటాయించారు. సర్పంచ్ అభ్యర్థులకు 30, వార్డు సభ్యులకు 20గుర్తులను కేటాయించారు. నోటాను కూడా బ్యాలెట్ పేపర్‌పై ముద్రించారు. పంచాయతీ ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహించేందుకు ప్రణాళికలను కూడా సిద్ధం చేశారు.

నిఘా నీడలో..

- జిల్లాలో 589 పంచాయతీలు, 5,398 వార్డులు ఉన్నాయి. కొద్ది రోజులుగా ఎన్నికలకు అవసరమైన సామగ్రి జిల్లాకు చేరింది.
- వీటిని స్థానిక గోదాముల్లో భద్రపరుస్తున్నారు. ఇతరులెవరూ లోపలికి వెళ్లకుండా సీసీ కెమెరాల పర్యవేక్షణ కొనసాగుతోంది. ఒక్కో వార్డుకు ఒక బ్యాలెట్ పెట్టెను వినియోగించనున్నట్టు సమాచారం. జిల్లాలో మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలను నిర్వహించడానికి ప్రణాళికలను కూడా సిద్ధం చేశారు. ఒక చోట వినియోగించిన బ్యాలెట్ పెట్టెలకు మరోచోట వినియోగించే అవకాశం ఉంది. ఇలా స్థానిక సంస్థలకు ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు ఉండగా గ్రామాల్లోనూ రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.

జిల్లా పంచాయతీ ఎన్నికల చిత్రం	
మొత్తం గ్రామ పంచాయతీలు	589
వార్డులు	5,398
పోలింగ్ కేంద్రాలు	5,438
మొత్తం ఓటర్లు	8,64,702
పురుషులు	4,18,151
మహిళలు	4,46,527
థర్డ్ జెండర్లు	24

'ఆత్మీయ భరోసా' అందరికీ అందేనా?

- చిన్న సన్నకారు రైతులకు శాపంగా మారిన నిబంధనలు
- కొందరికే అర్హతలు... సర్వేలో ఏరివేతలు...
- లక్షల్లో కూలీలున్నా.. వారిలో ఎంపికయ్యేది వేలల్లోనే..
- కుటుంబానికి ఒకరికి రూ.12 వేలు
- 21 నుంచి 24 వరకు జరిగే గ్రామసభల్లో అర్హుల ప్రకటన



గతంలో రైతుబంధు, ప్రస్తుతం రైతు భరోసా వంటి పథకాలతో ఇప్పటివరకు రైతులకు ప్రభుత్వం వ్యవసాయ పెట్టుబడి అందిస్తూ వస్తుంది. ఈ క్రమంలో దేశంలో ఎక్కడాలేని విధంగా ఈనెల 26 నుంచి భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయబోతోంది. ఏడాదికి రూ.12వేలను రెండు విడతలుగా రూ.6వేల చొప్పున అందించేందుకు అర్హులైన జాబితా కోసం అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. గ్రామాల్లో వ్యవసాయకూలీల సంఖ్య లక్షల్లో ఉన్నప్పటికీ ఈ పథకం నిబంధనలు అర్హులకు శాపం అవుతున్నాయి. ఉపాధి హామీ పథకం ప్రామాణికంగా తీసుకోవడం వల్ల అందరికీ ఈ పథకం అందే పరిస్థితి కనిపించడంలేదు.

ఖమ్మం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): చిన్న, సన్నకారు రైతులు ఎకరం, రెండెకరాల భూమి ఉన్నవారి కుటుంబాల నుంచి కూడా గ్రామాల్లో తమ సొంత వ్యవసాయం చేసుకుంటూ వ్యవసాయ కూలి పనులకు వెళ్తుంటారు. చిన్నకారు రైతు కుటుంబాలు అటు వ్యవసాయంపైనా.. ఇటు కూలి పనులపైనా ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. గ్రామాల్లో నిరుద్యోగం అటు యువతీ, యువకులు, మహిళల్లోనూ అధికంగా ఉంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రవేశపెట్టడంతో గ్రామాల్లో చాలామంది తమకు ఈ పథకం వర్తిస్తుంది అని కొండంత ఆశతో ఉన్నారు.

అయితే ప్రస్తుతం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలను జాబ్‌కార్డుల ఆధారంగా 2023-24 ఏడాదిలో 20 రోజులపాటు పనులకు వెళ్లిన వారు, సెంటు వ్యవసాయభూమి లేని ఉపాధి కూలీలను మాత్రమే అర్హులుగా తేల్చి వారికే అమలు చేయబోతున్నారు. వీరి జాబితాలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇటు ఖమ్మం, అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా అర్హులైన జాబితాలు సిద్ధమయ్యాయి. గ్రామ సభల్లో వారి పేర్లను బహిరంగం చేసి వారికి వ్యవసాయ భూములన్నాయా? లేదా? అన్నదానిపై లెక్కతేల్చనున్నారు.

అలాగే ప్రభుత్వ నిబంధనలు అనుసరించి 20 రోజులపాటు ఉపాధి హామీలో పాల్గొని భూమిలేని నిరుపేదలు ఎవరైనా అర్హుల జాబితాలో లేకపోతే వారి వివరాలను కూడా తీసుకుని అర్హుల జాబితాలో చేర్చే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా వ్యవసాయాధారిత జిల్లా కావడంతో రైతుల సంఖ్య, భూముల సంఖ్య కూడా అధికంగానే ఉంది. అదే క్రమంలో గ్రామాల్లో వ్యవసాయ కూలీల సంఖ్య కూడా అధికంగానే ఉంది.

ఖమ్మం జిల్లాలో 4,11,000 కుటుంబాలకు రేషన్ కార్డులున్నాయి. ఇవికాకుండా కొత్తగా తమకు రేషన్‌కార్డు ఇవ్వాలంటూ 30,665మంది దరఖాస్తు చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2లక్షల93వేల దరఖాస్తులుండగా, కొత్తగా 43 వేల77 దరఖాస్తులు వచ్చాయి. కాగా ఉపాధి హామీ పథకం కింద ఖమ్మం జిల్లాలో 3,04,404 జాబ్ కార్డులున్నాయి. ఇందులో ఉపాధి హామీ పనులకు వచ్చే వారి జాబితా చూస్తే 1,82,000మంది వరకు పనుల్లో పాల్గొంటున్నారు. ఈ పనుల్లో ఎస్సీ, బీసీ కులాలవారికి ఎక్కువ శాతం వ్యవసాయ భూములున్నాయి. ఎస్సీ వర్గాలకు ఎక్కువశాతం భూములు లేవు. దీంతో ఉపాధి హామీపనులకు హాజరై భూమి లేని నిరుపేదల సంఖ్య సుమారు 35వేల వరకు (మిగతా 6వ పేజీలో)

బయటపడుతున్న 'రైతుబంధు' లొసుగులు

- ఫంక్షన్‌హాల్, పరుపు బండలకూ పెట్టుబడి సాయం
- గుట్టలు, వెంచర్ల డేటా తొలగింపు
- 'పాలేరు'లో సుమారు 2,205 ఎకరాలు
- సాగుకు యోగ్యంకాని భూమి గుర్తింపు
- అత్యధికంగా ఖమ్మంరూరల్ మండలంలో సుమారు 1,375 ఎకరాలు



తిరుమలాయపాలెం మండలంలో సర్వేను పర్యవేక్షిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

కూసుమంచి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గుట్టలు ఉన్నా.. పంటలు పండించకున్నా.. పెట్టుబడి సాయం పొందిన భూముల లెక్క అటు ఇటుగా కొలిక్కి వస్తోంది. మూడు రోజులపాటు గ్రామాల్లో క్షుణ్ణంగా సర్వే చేసిన రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు... వందలాది ఎకరాలు పెట్టుబడి సాయం పొందినట్లు గుర్తించారు. సోమవారం పూర్తి స్థాయిలో లెక్క తేలుతుంది. సర్వేల్లో వెలుగుచూసిన, సాగుకు యోగ్యం కాని భూముల వివరాలను మంగళవారం నుంచి గ్రామాల్లో జరిగే గ్రామసభల్లో ప్రదర్శించి, ఎటువంటి అభ్యంతరాలు రానిపక్షంలో వాటిని రైతు భరోసా డేటానుంచి తొలగించనున్నారు. సర్వేను అడిషనల్ కలెక్టర్ శ్రీజ, జేడీఏ పుల్లయ్య, ఆర్డీవో నర్సింహారావు, ఏడీఏ సరిత, ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు లక్ష 55వేల ఎకరాలు సాగుభూమి ఉంది. 2023-24 సంవత్సరానికి యాసంగి పంటకుగాను 74,536మంది రైతులకు రూ.76.598కోట్లు పంటసాయం అందించారు. అయితే ఈ సీజన్ నుంచి పంటలు సాగుచేస్తున్న రైతులకే రైతు భరోసా అందించాలని 2023 యాసంగి సీజన్ లబ్ధిదారుల జాబితాను ప్రామాణికంగా తీసుకుని సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఆదేశాలమేరకు రెవెన్యూ, వ్యవసాయ అధికారులు, సర్వేయర్లు సర్వే చేస్తున్నారు.

వ్యవసాయేతర భూములకు...

పాలేరు నియోజకవర్గంలో గతపదేళ్లుగా భారీగా వెంచర్లు చేసినప్పటికీ, భారీగా రైతుబంధు పొందుతూ వచ్చారు. ఫంక్షన్ హాల్స్ వెంచర్లు, గృహ సముదాయాలకూ రైతుబంధు తీసుకుంటున్నారు. వీటిని గుర్తించి రైతు భరోసా డేటానుంచి తొలగిస్తున్నారు.

2,205 ఎకరాల గుర్తింపు

పాలేరు నియోజకవర్గంలో ఇప్పటివరకు సాగుకు యోగ్యంకాని సుమారు 2,205ఎకరాల భూమిని గుర్తించినట్లు తెలిసింది. అత్యధికంగా ఖమ్మంరూరల్ మండలంలో 1,375 ఎకరాలు గుర్తించారు. గత పదేళ్లుగా రియల్‌వెంచర్లను రికార్డుల్లో తొలగించకపోవడంతో రైతు బంధు పొందుతున్నారు. కూసుమంచి మండలంలో 330ఎకరాలు, నేలకొండపల్లి మండలంలో 240ఎకరాలు, తిరుమలాయపాలెం మండలంలో 260 ఎకరాలు గుర్తించినట్లు తెలిసింది. పాలేరులో ఓ ఫంక్షన్‌హాల్, మల్లేపల్లిలో సుమారు రెండెకరాల పరుపు బండకు, కూసుమంచిలో కంకరమిల్లుకు, దాని ఎదురు వెంచర్‌కు, సమీపంలో ఓ గుట్టను గుర్తించినట్లు సమాచారం. సోమవారం సాయంత్రానికి లెక్క తేలనుంది.



చితికిన ఆశలు

- అమాంతంగా దిగజారిన టమాట ధర
- 25కిలోల బాక్సు ధర రూ.150నుంచి రూ.200 వరకే...
- కొన్ని రోజుల క్రితం రూ.1500 వరకు పలికిన ధర
- పెట్టుబడులూ రాని పరిస్థితి
- ఆందోళనలో రైతులు



జూలూరుపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంటలు సాగు చేసి చేతులు కాల్చుకున్న రైతులు పంట మార్పిడికి సిద్ధపడి టమాట సాగు వైపు వచ్చారు. గత కొన్ని నెలలుగా టమాటకు గిరాకీ బాగా పెరగడంతోపాటు ధర కూడా ఆశాజనకంగా ఉండటం అన్నదాతల్లో ఆశలు రేకెత్తించింది. అయితే పంట చేతికి అందిన సమయంలో ఆశించిన రీతిలో ధర లేకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. భద్రాద్రి జిల్లాలో రైతులు ఖరీఫ్ సీజన్‌లో 800 ఎకరాల్లో టమాట సాగు చేశారు. రబీలో దీని విస్తీర్ణం పెరిగింది. సుమారు 1200 ఎకరాల్లో సాగు చేసినట్టు ఉద్యానవనశాఖ గణాంకాలు చెబుతున్నాయి. కాగా జూలూరుపాడు మండలంలోని కరివారిగూడెం, చింతలతండ, లైన్‌తండ, పాపకొల్లు, జూలూరుపాడు, వెంగన్నపాలెం, దండుమిట్టతండ, పడమటనర్సాపురం, కాకర్ల తదితర గ్రామాల్లో సుమారు 200ఎకరాల్లో రైతులు టమాట సాగు చేపట్టారు. ధర ఒక్కసారిగా దిగజారడంతో రైతులు కుదేలవుతున్నారు.

నిన్న ఎగిసింది.. నేడు దిగజారింది

కొన్ని రోజుల క్రితం వరకు 25 కిలోల టమాట బాక్స్ ధర రూ.1000 నుంచి రూ.1500 వరకు పలికింది. కాగా ప్రస్తుతం రూ.150 నుంచి రూ.200వరకు మాత్రమే పలుకుతోంది. ఈ ధర రైతులకు గిట్టుబాటు కావడం లేదు. దీంతో కొంతమంది రైతులు టమాటలు కోయకుండానే వదిలి వేస్తున్నారు. లాభాలు కురిపిస్తోందని ఆశపడి టమాట సాగు చేపట్టిన రైతులు నిరాశ చెందుతున్నారు. నిన్నటి దాక విపరీతంగా ఉన్న టమాట ధర ప్రస్తుతం దిగజారిపోయింది. అకాలవర్షాల కారణంగా కాపు కూడా ఆలస్యం కావడంతో తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు అంటున్నారు. చేతికి వచ్చిన పంటను కోసి మార్కెట్లో విక్రయించినప్పటికీ కూలీలకే (మిగతా 6వ పేజీలో)

ధర లేక నష్టపోతున్నాం..

నేలాల కిషింద్, రైతు (వెంగన్నపాలెం)



ఎకరం విస్తీర్ణంలో టమాట సాగు చేశా. తీరా పంట చేతికి వచ్చిన సమయంలో ధర తగ్గింది. దీంతో తీవ్రంగా నష్ట పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంట కోసి మార్కెట్లో విక్రయించినప్పటికీ కోత కూలీలకే సరిపోవడం లేదు. ఒక్కొక్క కూలీకి కాయలు కోసినందుకు రోజుకు రూ.500 చెల్లించాల్సి వస్తోంది.

పోలీసు క్రీడలు షురూ

- ప్రారంభించిన సీపీ సునీల్‌దత్
- మూడు రోజులపాటు జరగనున్న పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీపీ

ఖమ్మంక్రైం, జనవరి19 (ఆంధ్రజ్యోతి): క్రీడలు ఐక్యతను చాటిచెబుతాయని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. పోలీసు వార్షిక స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా ఖమ్మంలో పోలీసు హెడ్‌క్వార్టర్స్ పరేడ్ మైదానంలో క్రీడలు పోలీసు కమిషనర్ చేతులమీదుగా ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత పోలీసు క్రీడాకారుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం శాంతి కపోతాలు ఎగురవేసి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. కమిషనరేట్ పరిధిలోని ఖమ్మం టౌన్ ఖమ్మం రూరల్, వైరా, కల్లూరు, సబ్‌డివిజన్ల సివిల్ పోలీసులు, ట్రాఫిక్ ఆర్మ్‌డ్ రిజర్వు ఫోర్స్, స్పెషల్ వింగ్స్ స్టాఫ్ మొత్తం 300మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పురుషులకు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలు మూడురోజులపాటు జరగనున్నాయి. పురుషులకు 100, 200, 400, 800, 1500 మీటర్ల పరుగుపందెంతోపాటు కబడ్డీ, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్, హైజంప్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. తొలిరోజు వాలీబాల్ పురుషుల విభాగంలో ఖమ్మంటౌన్ వర్సెస్ కల్లూరు టీం ప్రారంభ మ్యాచ్‌ను పోలీసు కమిషనర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాదరావు, విజయబాబు, ట్రెయినీ ఐపీఎస్ రుత్విక్‌సాయి, ఏసీపీలు సాంబరాజు, నరసయ్య, సుశీల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం అభివృద్ధికి కృషి

- 26 నుంచి నాలుగు సంక్షేమ పథకాలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- బీఆర్ఎస్ నుంచి పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరికలు



బీఆర్ఎస్ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న భట్టి

ఎర్రుపాలెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాగద్వేషాలకు అతీతంగా, రాజకీయాలకు చోటులేకుండా ఎర్రుపాలెంను అభివృద్ధి చేద్దామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మండలంలో సఖినవీడు గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మండలానికి చెందిన మధిర మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చావా రామకృష్ణ, సొసైటీ చైర్మన్ మూల్పూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావుతో సహా మండలంలోని 31 గ్రామాల బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భట్టి మాట్లాడుతూ ప్రపంచంతో పోటీ పడాలంటే అభివృద్ధి జరగాలని, అది రాజకీయ పునరేకీకరణతోనే సాధ్యమని అన్నారు. మధిర ప్రజల ఆశీస్సులతో తాను రాజకీయంగా ఎదిగి ఎమ్మెల్సీ నుంచి ఉపముఖ్యమంత్రిని అయ్యానని తెలిపారు. నియోజకవర్గంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే అవకాశం వచ్చిందని, ఈ యజ్ఞంలో అందరూ భాగస్వాములవ్వాలని కోరారు. సీఎల్పీ నేతగా ఎన్నో పోరాటాలు చేసి, అభివృద్ధికి ఎన్నో ప్రణాళికలు తయారు చేశామన్నారు. పాదయాత్రలో రైతులు, మహిళలు, నిరుద్యోగులు, యువకులు పలురకాల సమస్యలను దగ్గరినుంచి చూశానని తెలిపారు. ఈనెల 26నుంచి రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లాంటి సంక్షేమ పథకాలు మీ ముందుకొస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నేతలు, పలు గ్రామాల నుంచి బీఆర్ఎస్ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



క్రీడాకారులు మురళి, చిట్టిబాబు, సతీష్, కల్లూరి భద్రయ్య

దుమ్ముగూడెం జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన నలుగురు ఆదివాసీ క్రీడాకారులు కల్లూరి మురళీకృష్ణ, కల్లూరి భద్రయ్య, నూప చిట్టిబాబు, అపక సతీష్‌లు జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎంపికయ్యారు. వీరిలో సింగారానికి చెందిన కల్లూరి భద్రయ్య ప్రభుత్వ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గత నెలలో భద్రాద్రి కొత్తగూడెంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అనంతరం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 4,5 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో లాంగ్ జంప్, హైజంప్, జావెలిన్‌త్రో విభాగాల్లో ప్రతిభ కనబర్చారు. ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 3వరకు కేరళలో నిర్వహించనున్న జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో వీరు పాల్గొంటారు. పలువురు క్రీడాకారులు వీరిని అభినందించారు. వీరిలో ముగ్గురు క్రీడాకారులు ఆర్థికంగా వెనుకబడిన వారు కావడంతో కేరళ పోటీల్లో పాల్గొనేందుకు దాతలనుంచి ఆర్థికసాయం కోరుతున్నారు.

25న యువ కళోత్సవ్-2025

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మువ్వా పద్మావతి రంగయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న ఖమ్మంరూరల్ మండలంలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో యువ కళోత్సవ్-2025 కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం నగరంలోని మువ్వా శ్రీనివాసరావు నివాసంలో యువ కళోత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల (6నుంచి 10తరగతుల) విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ, పాటలు, బృందనృత్యాల పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 1నుంచి 5 తరగతుల విద్యార్థులకు విచిత్ర వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నట్టు ప్రోగ్రాం కన్వీనర్ ఆర్ఎస్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఫెమా అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు, జిల్లా ప్రైవేటు పాఠశాలల అధ్యక్షుడు జి.కాంతారావు, జాఫర్ పాల్గొన్నారు.

మధిర బస్టాండ్ ఆధునీకరణకు

రూ.10కోట్లు మంజూరు

మధిర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మధిర ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునీకరించేసేందుకు ఆర్టీసీ బోర్డు రూ.10కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లో శనివారం జరిగిన ఆర్టీసీ బోర్డు సమావేశంలో నిధుల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ప్రస్తుతం నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన బస్టాండ్‌ను తొలగించి నూతనంగా ఆధునిక వసతులతో కూడిన రెండస్తుల బస్టాండ్ భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాల్సిందిగా ఆదేశాలు ఇవ్వడంతో ఆర్టీసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు పది కోట్లతో నూతన బస్టాండ్ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. ఆ ప్రతిపాదనలను భట్టి ఆదేశాలతో ఆర్టీసీ బోర్డు ఆమోదం తెలిపి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది.

1984లో బస్టాండ్ మంజూరు

మధిరలో ప్రస్తుతం ఉన్న బస్టాండ్, బస్‌డిపో 1984లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో సీఎం ఎన్టీరామారావు మంజూరు చేశారు. అంతేకాక వెంటనే ఏప్రిల్ 25న వీటి నిర్మాణాలకు ఆయనే స్వయంగా శంకుస్థాపన చేశారు. బస్టాండ్ నిర్మాణం పూర్తిచేసుకొని 1990, అక్టోబర్ 26న అప్పటి రవాణా శాఖా మంత్రి ప్రారంభించారు. ఈ బస్టాండ్ ఆరు ప్లాట్ ఫారాలకు స్లాబ్‌తో మరో ఆరు ప్లాట్ ఫారాలు స్లాబ్ లేకుండా నిర్మించారు. అప్పటినుంచి నాలుగు దశాబ్దాలుగా ప్రయాణికులకు ఉపయోగంలో ఉంది. బస్టాండ్, రైల్వేస్టేషన్ పక్కపక్కనే ఉండటంతో ప్రజలకు సదుపాయంగా ఉంది. ప్రస్తుతం పెరిగిన ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా సదుపాయాలు పెంచాలనే ఉద్దేశ్యంతో భట్టి విక్రమార్క సిఫార్సుతో నూతన భవనానికి నిధులు మంజూరు అయ్యాయి.

నూతన భవనం నిర్మాణం ఇలా..

ఈనిధులతో ప్రస్తుతం ఉన్న బస్టాండ్‌ను తొలగించి దాని స్థానంలో నూతనంగా రెండు అంతస్తులతో (జీ+1) అధునాతన సదుపాయాలతో నూతన బస్టాండ్ నిర్మాణం చేపట్టనున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం నూతన భవనం నిర్మాణానికి జరిపిన కేటాయింపులు ఇలా ఉన్నాయి.



గ్రౌండ్ ఫ్లోర్, పై అంతస్తు నిర్మాణానికి.. రూ.4.33కోట్లు, ప్రహరీ నిర్మాణానికి..రూ.12.24 లక్షలు, విద్యుత్ కోసం.. రూ.43.33 లక్షలు, శానిటేషన్- సెప్టిక్ ట్యాంక్-నీటిసదుపాయలకు రూ.40లక్షలు, సీసీ రోడ్లకు రూ.కోటి, ఆవరణ మొత్తం గ్రావెల్‌తో నింపేందుకు రూ.18.55లక్షలు, ఆర్‌వో ప్లాంట్‌కు రూ.5లక్షలు, ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ.30లక్షలు, ప్రస్తుత బస్టాండ్ తొలగించేందుకు రూ.15లక్షలు, తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటుకు రూ.10లక్షలు కేటాయింపులు జరిపినట్లు సమాచారం.

రూ.10 కోట్లు మంజూరయ్యాయి: డీఎం

మధిరలో కొత్త బస్టాండ్ నిర్మాణానికి రూ.10కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని డీఎం శంకర్‌రావు తెలిపారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలిపారు. అయితే పనులకు సంబంధించిన పూర్తి సమాచారం తమ వద్ద ఉండదని ఎప్పుడు పనులు చేపడతారు.. తదితర వివరాలు తమ హెడ్ ఆఫీసులోనే ఇంజనీరింగ్ విభాగం నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు.



మాట్లాడుతున్న ఏసురత్నం

పారిశుధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం

మధిర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ అనుబంధ మునిసిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మధిర మునిసిపాలిటీలో జరిగిన వర్కర్ల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని, అప్పటివరకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా మునిసిపల్ కార్మికులందరికీ ప్రతినెల ఒకటో తేదీన ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలను వెంటనే చెల్లించాలని, కార్మికులపై పని భారం తగ్గించాలని, బస్తీలు రోజు రోజుకు పెరుగుతున్నాయని, కాలనీలకు అనుగుణంగా కార్మికులను పెంచాలని కోరారు. 60ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి రూ.5లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, ఇంట్లోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, పనివేళలు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి బెజవాడ రవి, నాయకులు చెరుకూరి వెంకటేశ్వరరావు, యంగల ఆనందరావు, నాగేంద్రం, నరేష్, కుమార్, మార్తమ్మ, బుజ్జి, శ్రీకాంత్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఓ ఆటో డ్రైవర్ వినూత్న ఆలోచన

- లగ్జరీ బస్సులో వలే ఎల్ఈడీ టీవీ, స్పీకర్లు
- గర్భిణులకు ఉచిత ప్రయాణం
- గిరాకీలు పెంచుకునేందుకే అంటున్న ఆటో డ్రైవర్ రజనీకాంత్



ఆటోలో ఏర్పాటు చేసిన స్పీకర్, ఎల్ఈడీ టీవీ





ఆటోతో రజనీకాంత్

అశ్వారావుపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆటోలకు విపరీతంగా పెరిగిన పోటీ, మరోవైపు ఉచిత బస్సుతో తగ్గిన ఆటో కిరాయిలు. వీటిని తట్టుకొని గిరాకీ పెంచుకునేందుకు ఓ ఆటో డ్రైవర్ వినూత్నంగా ఆలోచించారు. ఆటోలో ప్రయాణికులను ఆకర్షించేందుకు ఆటోలో అధునాతన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఆటోలో మంచి సీట్లు, ప్రయాణికులకు అలసట లేకుండా వినోదాన్ని కలిగించేందుకు ఎల్ఈడీ టీవీ, స్పీకర్లు ఏర్పాటు చేశారు. అంతేకాదు గర్భిణులకు ఉచిత సర్వీసు అంటూ ఆటో మీద రాయించి సర్వీసు చేస్తున్నారు. ఇప్పుడు ఈ ఆటో డ్రైవర్ వినూత్న ఆలోచన మండలంలో చర్చనీయాంశంగా మారింది. వినోదం, ఆహ్లాదంతోపాటు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడం ద్వారా గిరాకీ పెంచుకునేందుకు ఈ ఏర్పాట్లు చేసినట్లు ఆటో డ్రైవర్ సొంగ రజనీకాంత్ తెలిపాడు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో గర్భిణులకు ఉచిత సర్వీసు చేస్తున్నట్టు తెలిపారు. అన్ని ఖర్చులు పోను రోజుకు రూ.500-600 మిగులుతాయని, వాటితో జీవనం సాఫీగానే సాగుతుందన్నాడు. ఈ డ్రైవర్ వినూత్న ఆలోచనకు హేట్సాఫ్ చెప్పాల్సిందే.

ఎస్సీ వర్గీకరణ చేయాల్సిందే..

- అట్టడుగు వర్గాలకు రాజ్యాంగ ఫలాలు దక్కాలి
- ఎస్సీ వర్గీకరణకు మేధావుల సంఘీభావ సదస్సులో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

ఖమ్మంటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వెంటనే చేయాలని పలువురు వక్తలు కోరారు. అట్టడుగు వర్గాలకు రాజ్యాంగ ఫలాలు దక్కాలని, ఎస్సీ వర్గీకరణను మాల, మాదిగ కులాల మధ్య సమస్యగా చూడవద్దని కోరారు. ఆదివారం నగరంలోని మంచికంటి సమావేశ మందిరంలో జాషువా సాహిత్య వేదిక, స్వర్ణ సామాజిక అధ్యయన వేదిక, బీసీ సంఘాల జేఏసీ, తెలంగాణా పీపుల్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ- మేధావుల సంఘీబావ సదస్సు నిర్వహించారు. జాషువా సాహిత్యవేదిక అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రముఖ రాజకీయ, సామాజిక, ఆర్థిక విశ్లేషకుడు ఐవీ.రమణారావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ మాల, మాదిగల పంచాయతీ కాదన్నారు. అట్టడుగు వర్గాలకు సమానంగా రాజ్యాంగ ఫలాలు దక్కాలని రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బీఆర్.అంబేద్కర్ కోరారన్నారు. అందుకే మాదిగ, మాదిగ ఉపకులాలతోపాటు ఎస్సీలోని అన్ని కులాలకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ ఫలాలు దక్కేందుకు అందరు సమైక్యంగా ఉండాలన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లగా ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చేస్తున్న పోరాటం అభినందనీయమన్నారు. ఈ సదస్సులో కాంగ్రెస్ నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, చోటే బాబా, కోట రాంబాబు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, టీడీపీ నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు, సీపీఐ, సీపీఎం, మాస్‌లైన్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు శింగు నర్సింహారావు, ఎం.సుబ్బారావు, ఆవుల అశోక్, ఆవునూరి మధు, ఆమ్‌ఆద్మీ నాయకులు ఎస్.తిర్మల్, పీఆర్‌టీయూ నాయకులు, యూటీఎఫ్ నాయకులు, మాదిగ ఉద్యోగులు సమాఖ్య నాయకులు జూనియర్ లెక్చరర్ల సంఘం నాయకులు సంఘీబావం తెలిపారు.

'ఆత్మీయ భరోసా' అందరికీ అందేనా!?

(5వ పేజీ తరువాయి)

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి తేలే అవకాశం కనిపిస్తుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,19,000వరకు జాబ్‌కార్డులుండగా ఇందులో 1,35,000 కూలీలు మాత్రమే పనులకు హాజరవుతున్నారు. ఈ పనులకు వచ్చే వారిలో కూడా ఎస్టీలే అధికంగా ఉన్నారు. అయితే ఏజెన్సీలో ఎస్టీ కుటుంబాలకు అటు పోడు భూములు, సాగు భూములు అధికంగానే ఉన్నాయి. దీంతో ఈ జిల్లాలో కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సుమారు 40 నుంచి 45వేల మంది వరకే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద అర్హత సాధించే అవకాశం ఉంది. ఆధార్‌కార్డు ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేశారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే ఆత్మీయభరోసా కింద రూ.12వేలు అందించనున్నారు. 21నుంచి 24వరకు జరిగే గ్రామసభల్లో మొత్తం అర్హుల జాబితా పక్కగా తేలనుంది.

చితికిన ఆశలు

(5వ పేజీ తరువాయి)

సరిపోతుందని రైతులు వాపోతున్నారు.

గిట్టుబాటు కాని పెట్టుబడులు

టమాట సాగుకు రైతులు ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. కాగా దిగుబడి ఎకరానికి 100 నుంచి 120 బాక్సులు వస్తున్నప్పటికీ గిట్టుబాటు కావడం లేదని రైతులు అంటున్నారు. వాటిని విక్రయించిన రూ.20వేల నుంచి రూ.30వేలలోపు మాత్రమే వస్తున్నాయని వీటిలో సగానికి పైగా కోత కూలీలకే చెల్లించాల్సి వస్తోందని వారు అంటున్నారు.

కలిసి రాని కాలం..

బోడా మోహన్‌లాల్, రైతు (కరివారిగూడెం)

ఎంతో ఆశపడి టమాట సాగు చేస్తే నిరాశే ఎదురవుతోంది. పంట చేతికి రాకముందు ధర ఆశాజనకంగా ఉంది. రైతుల చేతికి పంట వచ్చిన సమయంలో ధర తగ్గడంతో పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడంలేదు.

శిథిల భవనంతో పొంచి ఉన్న ప్రమాదం

- ఆందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



నల్లబండబోడు పాఠశాల ఆవరణలో కూలడానికి సిద్ధంగా ఉన్న శిథిల భవనం

జూలూరుపాడు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తరగతి భవనం శిథిలావస్థకు చేరుకుని కూలడానికి సిద్ధంగా ఉండటంతో విద్యార్థులకు ప్రమాదం పొంచిఉంది. మండలంలోని నల్లబండబోడు గ్రామంలోని గిరిజన ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన తరగతి గది ఏళ్లు గడుస్తుండటంతో శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఆ గదికి సమీపంలోనే మరో గదిని నిర్మించి 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు విద్యాబోధన సాగిస్తున్నారు. తరగతి గది పక్కనే శిథిల భవనం ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. పై పెచ్చులు ఊడి కింద పడుతుండటంతో ఎప్పుడు కూలుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

ప్రజల మౌలిక వసతులకు ప్రాధాన్యం

- ఇల్లెందు నియోజకవర్గంలో 180 కోట్లతో అభివృద్ధి
- శరవేగంగా 100 పడకల ఆస్పత్రికి అడుగులు

ఇల్లెందు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడానికి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పథకాలను శరవేగంగా పూర్తి చేయించడానికి అధికార యంత్రాంగం తీవ్ర స్థాయిలో యత్నాలు చేపడుతుంది. ఎమ్మెల్యే కోరం కనకయ్య నియోజకవర్గ పురోభివృద్ధికి అందివచ్చిన నిధులతో వివిధ మండలాల్లో మౌలిక వసతులపై దృష్టి సారిస్తుండటంతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగం పుంజుకున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో వివిధ గ్రామాలతో పాటు ఇల్లెందు పట్టణంలో అభివృద్ధి పథకాలను పూర్తి చేయించేందుకు ఎమ్మెల్యే కోరం కనకయ్య తీవ్రస్థాయిలో యత్నాలు చేస్తున్నారు. నియోజకవర్గంలో జల, ఖనిజ వనరులున్నా సాగు నీరు, భారీ పరిశ్రమలకు నోచుకొని గిరిజన ప్రాంతాలతో కూడిన ఇల్లెందు నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలు పెంపొందించాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే కోరం సాగుతున్నారు. ఎన్నికల వరకే పార్టీలు, రాజకీయాలు ఆ పిదప రాజకీయాలకు అతీతంగా వివక్షతలకు తావు లేకుండా అభివృద్ధి ఫలాలు అందించాలన్న తపన కలిగిన ఎమ్మెల్యే కనకయ్య నియోజకవర్గంపై రాజకీయ పట్టు బిగుస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పూర్తి స్థాయిలో పట్టు సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. రాష్ట్ర ఖజానాలో నిధుల కొరత తీవ్రంగా ఉన్నప్పటికి అవకాశం ఉన్న మేరకు నియోజకవర్గానికి వివిధ పథకాల కోసం నిధులు మంజూరు చేయించుకుంటూ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అర్హులకు అందిస్తుండటం గమనార్హం.





మామిడి గుండాల- చాపలవారి గుంపు నడుమ నిర్మించిన బీటీ రోడ్డు



పెగళ్లపాడులో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం

జఠిలంగా సమస్యలు.. ప్రజలు ఎదురుచూపు..

ఎన్నికల్లో ఇచ్చిన పలు కీలక హామీలపై ఏడాది కాలంలో కృషి ప్రారంభించినప్పటికి ఇంకా పూర్తి స్థాయిలో ఫలించలేదు. ఇల్లెందు పట్టణంలో స్టేడియం నిర్మాణ పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాలేదు. 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను శరవేగంగా చేపట్టాలన్న యోచనతో టెండర్ ప్రక్రియను పూర్తిచేయించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న జేకే కాలనీ బస్టాప్ ప్రధాన రోడ్డు చెంతనే ఆస్పత్రి భవన సముదాయాల నిర్మాణాలకు సింగరేణి క్వార్టర్ల స్థలాలను కేటాయింప జేసేందుకు సింగరేణి యాజమాన్యాన్ని ఒప్పించడం విశేషం. సాగునీటి వనరులు లేని ఇల్లెందు నియోజకవర్గంలో సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసినప్పటికి నియోజకవర్గంలోని భూములకు సాగు నీరు ఇవ్వకుండా నాగార్జున సాగర్ ఆయకట్టు స్థిరీకరణ భూములకే సాగు నీటిని మళ్లించటం పట్ల నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు తీవ్ర ఆవేదనలో కూరుకపోతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు కొమరారం, బోడు మండలాల ఏర్పాటు ఇల్లెందు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ హామీ కేంద్ర ప్రభుత్వ పరిధిలో దశాబ్ద కాలంగా పెండింగ్‌లోనే కూరుకపోగా సింగరేణి కాలరీస్ పూసపల్లి, కోయగూడెం ఓపెన్ కాస్ట్ మూడు ప్రాజెక్టుల కోసం సింగరేణి కార్మికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

నియోజకర్గంలో మంజూరు చేసిన నిధులు..

నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య గడిచిన ఏడాది కాలంలో వివిధ విభాగాల్లో అభివృద్ధి పనులకు ఇల్లెందు, టేకులపల్లి, కామేపల్లి, గార్ల, బయ్యారం మండలాలల్లో దాదాపు రూ. 180 కోట్లు మంజూరు చేయించారు.

బడి బయట ఎందరు..?

- బడిబయట పిల్లలపై విద్యాశాఖ ముమ్మరంగా సర్వే
- నెలాఖరు వరకు వివరాల సేకరణ
- ప్రబంధ పోర్టల్‌లో వివరాల నమోదు

అశ్వారావుపేట రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం బడి ఈడు పిల్లలందరూ తప్పకుండా బడిలో ఉండి చదువుకోవాలి. అందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తోంది. పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు అందిస్తోంది. ఇన్నీ చేసినా కాని కొన్ని పరిస్థితుల వలన అనేకమంది బడులకు వెళ్లకుండా ఇళ్ల వద్దనే ఉంటున్నారు. కొందరు బడులు మానేసి పనులు చేసుకుంటున్నారు. ప్రాథమిక విద్యను పూర్తిచేసిన అనేకమంది ఉన్నత చదువులకు దూరంగా ఉంటున్నారు. ఈనేపధ్యంలో బడిఈడు పిల్లలందరికీ విద్యను అందించాలనే సంకల్పంతో తెలంగాణా ప్రభుత్వం ఏటా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో బడి బయట పిల్లల వివరాలను సేకరించి వారికి అనేక మార్గాల ద్వారా విద్యను అందిస్తుంది. వివిధ కారణాల వలన రోజువారీ కూలీలు వలస వెళ్లటం, ఇటుక బట్టీల నిర్వహించటం వంటి వాటిలో పిల్లలు పనులు చేయటం సాధారణంగా మారుతుంది. దీంతో పిల్లల చదువులు అర్థాంతరంగా ఆగిపోతున్నాయి. దీంతో పిల్లలు ఎక్కడ ఉంటే అక్కడే విద్యను అందించటంతో పాటు ఉన్నత విద్యను అభ్యసించేలా విద్యాశాఖ ప్రణాళికలు చేపట్టింది. ఈనేపధ్యంలోనే విద్యాశాఖ అధికారులు బడిబయట పిల్లల వివరాల నమోదుకు శ్రీకారం చుట్టారు.

జిల్లాలో నెలాఖరు వరకు సర్వే

భద్రాద్రి కొత్తగూడెం విద్యాశాఖ ఆధ్వర్యంలో గతనెల 12వ తేదీ నుంచి ఈనెల 10వరకు బడిబయట పిల్లలపై సర్వే జరగాల్సి ఉంది. అయితే సమగ్ర శిక్ష సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టారు. సీఆర్‌పీలు, ఐఈఆర్‌పీలు సమ్మెలో ఉండటంతో సర్వే ప్రారంభంకాలేదు. సిబ్బంది సమ్మెను విరమించటంతో తిరిగి సర్వేను చేపట్టాలని జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో సిబ్బంది సంక్రాంతి సెలవుల తరువాత బడిబయట పిల్లల వివరాలపై సర్వే ప్రారంభించారు. జిల్లాలో 90 మంది సీఆర్‌పీలు, 36 మంది ఐఈఆర్‌పీలు ప్రస్తుతం సర్వే చేస్తున్నారు. సీఆర్‌పీలు, ఐఈఆర్‌పీలు 6 ఏళ్ల నుంచి 14 ఏళ్లలోపు బాలలతో పాటు అర్థాంతరంగా చదువులు మానేసిన 15 ఏళ్ల నుంచి 19 ఏళ్లలోపు వారిని గుర్తిస్తున్నారు. సీఆర్‌పీలు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ఇటుక బట్టీలలో, ఇతర పనుల ప్రదేశాల్లో పనిచేస్తున్న పిల్లలు, ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చి పనులు చేసుకుంటున్న వారి పిల్లలు, పేదలు నివసించే ప్రాంతాలు, పరిశ్రమ ప్రాంతాల్లో తిరుగుతూ వివరాలు సేకరిస్తున్నారు. బడి బయట పిల్లల పేరు, ఆధార్ వివరాలు, జనన తేదీ, వయసు, ఫోన్ వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తున్నారు. బడిబయట ఉండటానికి గల కారణాలను తెలుసుకుంటూ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. బడి ఉండటం ద్వారా కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరిస్తూ అవగాహన కలిగిస్తున్నారు.

ప్రబంధ పోర్టల్‌లో నమోదు

క్షేత్రస్థాయిలో సేకరించిన బడిబయట పిల్లల వివరాలను ప్రభుత్వం రూపొందించిన ప్రబంధ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. సర్వే సమయంలో సేకరించిన ప్రతి విషయాన్ని పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈనెల 30వరకు సీఆర్‌పీలు సర్వే వివరాలను ఎంఈవోలకు అందించాలి

సమాన తరగతుల్లో చేర్పించటానికి

సర్వేలో బడి బయట పిల్లలను గుర్తించిన అనంతరం వారిని తిరిగి వయస్సుకు తగిన తరగతిలో చేర్పించటానికి విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతుంది. 6 నుంచి 14 సంవత్సరాలలోపు 10 మంది ఒకేచోట ఉంటే వారికి ప్రత్యేక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. 15 ఏళ్ల నుంచి 19 సంవత్సరాల వారిని ఓపెన్ స్కూల్ విధానంలో 10వ తరగతి, ఇంటర్‌లో చేర్పించనున్నారు.



బడిబయట పిల్లలపై సర్వే చేస్తున్న సీఆర్‌పీ

పకడ్బందీగా బడిబయట పిల్లల సర్వే

నాగరాజశేఖర్, ఏఎంవో



జిల్లా వ్యాప్తంగా బడిబయట పిల్లల సర్వేను పకడ్బందీగా చేపడుతున్నాం. ఈసర్వే వివరాలను ఎప్పటికపుడు ప్రబంధ పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం. సర్వేలో గుర్తించిన విద్యార్థులను మోటివేట్ చేసి వచ్చే విద్యాసంవత్సరానికి సమాన తరగుతుల్లో చేర్పించటానికి సన్నాహాలు చేస్తున్నాం.

మాస్టర్స్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక



విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న బ్యాడ్మింటన్ సంఘం బాధ్యులు

ఖమ్మంస్పోర్ట్స్,జనవరి19(ఆంధ్రజ్యోతి): పాల్వంచలో ఫిబ్రవరి6 నుంచి 9 వరకు జరిగే రాష్ట్రస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే జిల్లా బ్యాడ్మింటన్ జట్లను ఆదివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 150 మంది పాల్గొన్నారు. పోటీలలో భాగంగా 35 నుంచి 70 సంవత్సరాల పైబడిన మహిళలు, పురుషులకు ఏజ్ గ్రూప్ ఆధారంగా సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశార. పోటీల అనంతరం విజేతలకు డీఎస్పీ సునిల్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. పోటీలను జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్, ఏసీపీ ఘంటా వెంకట్రావు, ట్రెజరర్ వి. చంద్రశేఖర్, రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం మాజీ ఉపాధ్యక్షుడు సిరిపురపు సుదర్శనరావు, ప్యాట్రన్స్ రవిమారుత్, కర్నాటి వీరభద్రం, సంఘ బాధ్యులు జట్ల శ్రీనివాస్, కొంగర శ్రీనివాస్, కొల్లి సత్యనారాయణ తదితరులు సమీక్షించారు.

ఎస్సీవర్గీకరణ న్యాయమైంది

ఎంఆర్‌పీఎస్‌కు సీఎల్‌సీ సంపూర్ణ మద్దతు

కొత్తగూడెం,జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ(ఏబీసీడీ)లకు పౌరహక్కుల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ఉంటుందని అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు ఎస్. ఉపేందర్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎస్సీవర్గీకరణ అంశం వివాదస్పదంగా మారిందని, వివాదానికి కారణమైన పాలకుల వైఖరిని ఎండగట్టడం కోసం ఆయా సంస్థలు సంయమనం పాటించాలని కోరారు. అసెంబ్లీలో చట్టబద్ధత తీసుకోవాల్సిన అవసరం కాంగ్రెస్‌పై ఉందని అన్నారు.

ఆటోలే ఆధారం

గ్రామాల్లో కానరాని పల్లె వెలుగు బస్సులు
సర్వీసులు పెంచాలంటున్న ప్రయాణికులు



ఆటోలో ప్రయాణికులు

మణుగూరుటౌన్,జనవరి19(ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన గ్రామాలకు ఆటోలే ఆధారమవుతున్నాయి. మణుగూరు మండలంలోని ప్రజలు ప్రయాణాల కోసం ఆటోలపై నే ఆధారపడుతున్నారు.ఈ మండలంలో దాదాపు 50 గ్రామాలు ఉన్నాయి. కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. ఇక్కడ సైకిళ్ల మోటార్ సైకిళ్ల ఆటోలు ప్రజల ప్రయాణ అసరాలను తీరుస్తున్నాయి. ఇంకా రహదారి సౌకర్యాలు లేక అనేక గ్రామాలకు రవాణా సౌకర్యాలు అందుబాటులో లేకుండా పోయాయి,

మణుగూరు ఆర్టీసీ డిపో ఎక్స్‌ప్రెస్‌లే

దూరప్రాంతాలకు వెళ్లి వచ్చే ఎక్స్‌ప్రెస్ బస్సులే అధికంగా ఉన్నాయి. ఎక్స్‌ప్రెస్ 55 బస్సులు ఉండగా ఆర్డినరీ 15 బస్సులు ఉన్నాయి. గ్రామాలకు సరిపడా పల్లె వెలుగు బస్సులు లేకపోవడంతో ఆటోల వినియోగం ఎక్కువైంది. ఖమ్మం, హైద్రాబాద్‌లకు ఎక్కువ బస్సులను నడుపుతున్నారు. విజయవాడ గుంటూరు, కనిగిరి, విశాఖపట్నంపట్టణాలకు మరో ఐదారు సర్వీసులను పెంచాల్సి ఉంది, వీటికి తోడు మరో 10వరకు ఆర్డినరీ బస్సులు తిప్పితే పల్లె ప్రజల ఇబ్బందులు కొంత వరకైనా తీరుతాయాని ప్రజల సూచిస్తున్నారు.

1000 పైగా ఆటోలు

మండలంలో 1000 పైగా ఉన్న ఆటోలు ప్రజల అవసరాలను తీరుస్తున్నాయి. భద్రాచలం అశ్వాపురం, సారపాక మణుగూరు పారిశ్రామిక ప్రాంతాలు కావడంతో రోజు వేలాది మంది ఆటోలో ప్రయాణాలు సాగిస్తున్నారు. మణుగూరు నుంచి కరకగూడెం, పినపాక మంగపేట, ఏటూరు నాగారం వెపు వెళ్లేందుకు చాలనన్ని బస్సులు లేక ఆటోల్లో ప్రయాణాలు చేస్తున్నారు. రోజుకు వేయి మందికి పైగా నిత్యం రాకపోకల్ని సాగిస్తుంటారు మణుగూరు అశ్వాపురం పినపాక మండల ప్రజలు ఎక్కువగా భద్రాచలం కొత్తగూడెం పట్టణాలకు ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈ వేయి ఆటోలు కూడా ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటున్నాయి. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ వారు పల్లెవెలుగు సర్వీసులను కరకగూడెం ఏటూరు నాగారం వైపు పెంచాల్సి ఉంది.

రైలు సౌకర్యం నామ మాత్రం

మణుగూరులో రైలుసౌకర్యం నామ మాత్రంగా ఉపయోగపడుతోందినిత్యం మణుగూరు నుంచి సికింద్రాబాదుకు రెండు ఆర్డీనరీ రైలునడుపుతున్న ప్రయాణికుల ఆదరణ తక్కువగా ఉన్నందున ఆ రెండు రైళ్లను రద్దు చేశారు. ప్రస్తుతం ప్రతీరోజు రాత్రి ఒకేఒక్క సర్వీసును మణుగూరు నుంచి సికింద్రాబాద్‌కు నడుపుతున్నారు. పాండు రంగాపురం రైల్వేస్టేషన్‌ను రైల్వే లైన్ సారపాక వరకు 17 కిలోమీటర్లు పొడిగించే ప్రతిపాదన కార్య రూపం దాల్చితే ఈప్రాంతానికి రైలు సౌకర్యం చేరువౌతుంది.

న్యాయవాదుల క్రికెట్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న న్యాయాధికారి

ఖమ్మంలీగల్, జనవరి19(ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్‌డే సందర్భంగా జిల్లా న్యాయవాదులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. సంపత్ టీమ్ ప్రథమ, వరుణ్ టీమ్ ద్వితియ బహుమతులు సాధించారు. స్థానిక ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కాళాశాల మైదానంలో జరిగిన ఈ పోటీలకు ముఖ్యఅతిథులగా జిల్లా అదనపు న్యాయాధికారులు దేవినేని రాంప్రసాద్, వసుకుల శీనయ్య హాజరై పోటీలను ప్రారంభించారు.ఈకార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చింతనిప్పు వెంకట్, స్పోర్ట్స్ సెక్రటరీ అలవాల యుగంధర్, ఈసీ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. పోటీలకు ఆర్గనైజర్లుగా బిల్లా శ్రీనివాసరావు, పబ్బతి రామబ్రహ్మం, చింతల పవన్‌కుమార్, పువ్వాడ రంగారావు వ్యవహరించారు.

ఆలోచింపజేసిన సంకల్పం నాటిక

- ప్రకృతికి, పర్యావరణానికి మేలు చేయాలని హితవు
- దర్శకత్వం, నటీనటులు పూర్తిగా మహిళలే




ఖమ్మంసాంస్కృతికం,జనవరి19 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరూ ప్రకృతికి, పర్యావరణానికి మేలు చేసే క్రతువుకు సంకల్పించాలన్న సందేశంతో సాగిన సంకల్పం నాటిక ప్రతిఒక్కరినీ ఆలోచింప చేసింది. నెలనెలా వెన్నెల సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో విశాఖపట్టణం జాస్మిన్ ఆర్ట్స్ అండ్ కల్చరల్స్ కళాకారులు ప్రదర్శించిన ఈనాటిక పలు ప్రత్యేకతలను సంతరించుకుంది. వ్యవసాయం రైతుసమస్యలు వాటి పరిష్కారాలు ఇతివృత్తంగా రూపొందిచటం ఒక ప్రత్యేకత.. అయితే నాటికకు దర్శకత్వం సహా పాత్రధారులందరూ మహిళలే కావటం మరో విశేషం.. రసాయనాలు వాడటం వలన ప్రకృతికి పర్యావరణానికి ఎటువంటి చేటు కలుగుతోంది. వ్యవసాయానికి అధిక పెట్టుబడుల వల్ల గిట్టుబాటు కాకుండా పోతున్న వైనాన్ని కళ్లకు కట్టినట్లు చూపారు. సంప్రదాయ ప్రకృతి సిద్ధ సాగు పద్ధతులు అవలంబిస్తే తక్కువ ఖర్చుతో ఆశించిన దిగుబడులతోపాటు పర్యావరణానికి సమస్య లేకుండా ఉంటుందని చాటిచెప్పారు. పశువుల పేడ, మూత్రం, పలు రకాల కషాయాలను వినియోగించటం వల్ల సాగు భారాన్నితగ్గించుకోవచ్చని తెలిపారు. విత్తనం విత్తేది మొదలు పంట కోసి ఇళ్లకు తరలించేవరకు వ్యవసాయంలో ప్రధాన పాత్రపోషించే మహిళలు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు దారి చూపటం ఈనాటిక ప్రత్యేకత. సూరమ్మ, అన్నపూర్ణ, లచ్చమ్మ, కాంతం, మంత్రి పాత్రలలో సంధ్యాప్రియదర్శిణి, సీతామహాలక్ష్మి, వరలక్ష్మి, శివజ్యోతి, సుజాతలు నటించి మెప్పించారు.

హక్కుల కోసం పోరాటాలే శరణ్యం

ఖమ్మంమామిళ్లగూడెం, జనవరి19 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యమని గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బండిజయరాజు, గుడిశ లెనిన్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఖమ్మంలో గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం(ఏఐడీఎస్‌యూ) మహాసభ యడ్లపల్లి పట్టాభి రామయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డాక్ సేవలకుల హక్కులు, సమస్యల సాధన కోసం పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఈసభలో నాయకులు మహ్మద్, పి.రామారావు, వేంకటరెడ్డి, కె మహేందర్, ఏఏ ఖాన్, బండి యల్లారావు, శుభాస్, మౌలాలి, భట్టార్, సాగర్, వేంకట కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గం గౌరవాధ్యక్షుడిగా లెనిన్ శ్రీనివాస్, పుచ్చకాయల వెంకటేశ్వరావు, పి.రామారావు, జి.శేషగిరిరావు, అధ్యక్షులు షేక్ మౌలాలి, కార్యదర్శి యం డి ఖాజ మోహినుద్దీన్,కోశాధికారి వి. మహేష్ లను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

కవులు సమాజానికి దిక్సూచిలా ఉండాలి

ప్రముఖ సాహితీవేత్త విద్యాధరరావు, ధిక్కారం కవిత్వ సంకలనం ఆవిష్కరణ



ధిక్కార కవిత్వ సంకలనం ఆవిష్కరణ దృశ్యం

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) కవులు సమాజానికి దిక్సూచీలా ఉండాలని ప్రముఖ సాహితీవేత్త జెల్ది విద్యాధరరావు అన్నారు. ఆదివారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో సీనియర్ కవి కపిల రాంకుమార్ అధ్యక్షతన జరిగిన సాహిత్య సభలో ధిక్కారం కవిత్వ సంకలనాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని సన్మార్గంలో నడింపించగల శక్తి సాహిత్యానికి ఉందన్నారు. కవులు సమసమాజ నిర్మాణానికి తమవంతు కృషి చేయాలన్నారు. సమాజాన్ని చైతన్యం చేసే రచనలను చేయటంతోపాటు పాలకులు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తే వాటిని ప్రశ్నించాలన్నారు. అన్యాయాలు, అకృత్యాల పట్ల కొరడా ఝుళిపించే రచనలు చేయాలన్నారు. మణిపూర్ ఘటన సమాజానికి మాయని మచ్చ లాంటిదన్నారు. అక్కడి మహిళలను వివస్త్రలుగా చేసి వీధుల్లో ఊరేగించిన దుర్మార్గంపై కవుల స్పందన అభినందనీయమన్నారు. ఘటనను నిరసిస్తూ కవులుతమ కలాలను ఎక్కుపెట్టి బాధితుల తరుపున రచనలు చేశారన్నారు. అన్నికవితలలో ఆగ్రహం, ఆవేశం, ప్రశ్నించే తత్వం కనబడిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొణిజర్ల, జనవరి19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని శాంతినగర్ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం.. కూసుమంచి మండలం నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన నూతగాని గోపి(36) అనే దివ్యాంగుడు, ఓర్సు రామారావులు కలిసి మూడు చక్రాల స్కూటిపై వైరాకు వచ్చి వెళ్తుండగా శాంతినగర్ సమీపంలో కారు అతివేగంతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గోపి, రామారావులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఢీకొట్టిన కారులోనే ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే గోపి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రామారావు చికిత్స పొందుతున్నాడు. మృతుడి తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాయిరాంతండా వద్ద వలస కూలీ..

జూలూరుపాడు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వలస కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని సాయిరాంతండా గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది.

పోలీసులు, స్థానికులు, తెలిపిన వివరాల ప్రకారం..ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వలస కూలీ బూదు (40) మిర్చి కోతల పనులను చేపట్టేందుకు గత కొన్ని రోజుల క్రితం తోటి కూలీలతో కలసి సాయిరాంతండా గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో బూదు బహిర్భుమికి వెళ్లి రహదారి దాటుతుండగా కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళుతున్న గుర్తు తెలియని కారు అతడిని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో అతనికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు..

మధిర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలోని రైల్వే గేటు సమీపంలో కిలోమీటర్ నెం. 528/30-32 వద్ద డౌన్ మెయిన్‌లైన్‌పై వెళ్తున్న గుర్తు తెలియని రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు (33) మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈమేరకు రైల్వే ఎస్ఐ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో మధిర అవుట్‌పోస్టు ఇన్‌చార్జి వేణుగోపాలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు కొణిజర్ల మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

తల్లాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం మిట్టపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని కలకొడిమ గ్రామానికి చెందిన బాడిశ పుల్లారావు(31)చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. డిసెంబరు 26వతేదీన నూతనకల్‌లోని అత్తవారింటి వద్ద నుంచి స్వగ్రామమైన కలకొడిమ వెళ్లేందుకు పుల్లారావు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై బయల్దేరాడు. మిట్టపల్లి-పెద్దకోరుకొండి ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను టీవీఎస్ ఎక్స్‌ఎల్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పుల్లారావు మృతి చెందాడు. ఈ మేరకు ఎస్‌హెచ్‌వో శశికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దుండగుల దాడి

తల్లాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన మండలంలోని ముద్దునూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..తల్లాడ మండలం ముద్దునూరు గ్రామంలో ఇంట్లో నిద్రిస్తున్న అనుమోలు రామారావు అనే వ్యక్తిపై శనివారం అర్ధరాత్రి ముసుగు ధరించిన గుర్తుతెలియని ఐదుగురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. రామారావు ఇంట్లో తలుపులు వేసుకోకుండా నిద్రిస్తుండగా ఐదుగురు వ్యక్తులు ముసుగులు ధరించి కర్రలతో రామారావుపై దాడికి పాల్పడ్డారు. దాడిలో రామారావు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు తల్లాడ ఎస్ఐ బి.కొండల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ నీరు అందక ఎండిపోతున్న పంటలు

- వారబంధిపై రైతులకు సమాచారం అందించని అధికారులు
- అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు



సాగర్ నీరు నిలిపి వేయడంతో వాడిపోతున్న మిరప పైరు

కల్లూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కల్లూరు డివిజన్ మధిర బ్రాంచ్ కాల్వ పరిధిలో సాగు చేసిన ఆరుతడి పంటలు పత్తి, మిరప, మొక్కజోన్న పైర్లకు సాగునీరు అందక మొక్కలు వాడిపోతున్నాయని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మధిర బ్రాంచ్ కాల్వ ద్వారా గత వారం రోజుల క్రితం సాగునీటి సరఫరా నిలిపి వేయడంతో ఆరుతడి పంటలకు సాగునీటి తడులు అందక పైర్లు వాడిపొతున్నాయని పలువురు రైతులు చెబుతున్నారు. ఇప్పటికే మధిర బ్రాంచ్ కాల్వ పరిధిలో నీటి సరఫరా నిలిపి వేసి వారం రోజులు కావస్తుందని రైతులు అంటున్నారు. యాసంగి సీజన్‌లో సాగర్ కాల్వపై నీటి సరఫరాలో వారబంది పద్ధతిపై సాగునీటి సరఫరా చేస్తున్నట్లు తమకు జలవనరులశాఖ అధికారులు ముందస్తుగా సమాచారం అందించలేదని దీంతో రైతులకు తెలిపరచకుండా ఆకస్మాత్తుగా సాగునీటిని నిలిపి వేయడంతో తాము పైర్లకు ఆరుతడులను సకాలంలో అందించలేకపోయామని రైతులు వాపోతున్నారు. ప్రతి ఏడాది యాసంగి సీజన్‌లో సాగర్ అధికారులు వారబంధి అములుపై షెడ్యూల్ విడుదల చేసేవారని చెబుతున్నారు.

సుమారు 2వేల ఎకరాలకు అందని నీరు

సాగర్ అధికారులు సాగునీటి విడుదలపై స్పష్టత ఇవ్వక పోవడంతో మధిర బ్రాంచ్ కాల్వ పరిధిలో సాగు చేసిన పత్తి, మిరప, మొక్కజొన్న పైర్లు సుమారు 2 వేల ఎకరాల్లో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని పోచారం, తాళ్లూరు, వెంకటాపురం, చిన్నకోరుకొండి, వెన్నవల్లి, తెలగవరం, మర్లపాడు తదితర గ్రామాల్లో పత్తి, మిరప, మొక్కజోన్న పంటలకు సాగు నీటి తడులు అందించాల్సిన అవశ్యకత ఉంది. తాము గత పదిహేను రోజుల క్రితం మాత్రమే పైవిధంగా పైర్లకు నీటి తడులు అందించామని బాధిత రైతు చింతలపూడి బారిష్టార్ తెలిపారు. ఇలా సాగు చేసిన పైర్ల చుట్టూ తిరుతూ సాగునీటి కోసం ఎదురూ చూడాల్సి వస్తుందంటున్నారు. మధిర బ్రాంచ్ కాల్వపై వారబంధి విషయం తమకు తెలియ పరచలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జలవనరులశాఖ అధికారులు స్పందించి మధిర బ్రాంచ్ కెనాల్ పరిధిలో వారబంధి నీటిసరఫరాపై స్పష్టత ఇవ్వాలని పలు గ్రామాల రైతులు అధికారులను కోరుతున్నారు. జలవనరులశాఖ ఇంజనీరింగ్ అధికారి వివరణ ఇస్తూ మధిర బ్రాంచ్ కాల్వపై వారంబందిపై ఈ నెల 15 నుంచి అమలు చేస్తున్నామని తెలిపారు.

అప్పుల బాధతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

- సత్యనారాయణపురంలో ఘటన

ఇల్లెందు టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఇల్లెందు పట్టణంలోని సత్యనారాయణపురంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సత్యనారాయణపురానికి చెందిన ఆటో డ్రైవర్ రెడ్డిబోయిన సుమంత్(36) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇంట్లో కుటుంబం గడించేందుకు సుమారు రూ.6లక్షలు అప్పులు చేశాడు. తల్లిదండ్రులు సైతం కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అప్పులు కట్టేందుకు సరైన ఆర్థిక స్థోమత లేకపోవడంతో మనస్తాపం చెంది ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా మృతదేహాన్ని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుడికాల్వకు సాగునీటి సరఫరా పునరుద్ధరణ



సాగునీటి పునరుద్ధరణను పరిశీలిస్తున్న ఐబీ ఎస్ఈ వెంకటేశ్వర్లు

వైరా, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ కుడి కాల్వకు సాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. 'సాగునీటికి గ్రీన్‌ఫీల్డ్ అడ్డుకట్ట' అనే శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి నీటిపారుదలశాఖ అధికారులు వెంటనే స్పందించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే వంతెన పనుల కోసం నీటి సరఫరాను అడ్డుకుంటూ మట్టి కట్ట వేయడంతో కుడి కాల్వ ఆయకట్టు పరిధిలో పంటలు సాగుచేసిన రైతులు నీటి కోసం ఆందోళన చెందారు. మొక్కజొన్న, మిర్చి, వరి పంటలకు సాగునీటి సరఫరా లేక రైతులు పడుతున్న ఇబ్బందులను అలాగే గ్రీన్‌ఫీల్డ్ హైవే తీరును 'ఆంధ్రజ్యోతి' తన కథనం ద్వారా వెలుగులోకి తెచ్చింది. దాంతో నీటిపారుదలశాఖ ఖమ్మం ఎస్ఈ మంగలంపూడి వెంకటేశ్వర్లు, డీఈ పి.శ్రీనివాస్, ఏఈ వెంకట్రాములు గ్రీన్‌ఫీల్డ్ హైవే సిబ్బంది అడ్డు వేసిన మట్టి కట్టవద్దకు చేరుకొని దానిని తొలగింపజేసి నీటి సరఫరాను పునరుద్ధరింపజేశారు. దాంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ముత్యాలమ్మ ఆలయ హుండీ చోరీ

మణుగూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పట్టణ ప్రాంతంలోని అశోక్ నగర్‌లో గల ముత్యాలమ్మ ఆలయంలో గుర్తు తెలియని దొంగలు ప్రవేశించి ఆలయ హుండీని పగులగొట్టి నగదును చోరీ చేశారు. శనివారం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం ఆలయానికి చేరుకునే సరికి హుండీ పగుల గొట్టి నగదును చోరీ చేసినట్లు గుర్తించారు. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

పాల్వంచ, జనవరి 19 ఆంధ్రజ్యోతి: అకారణంగా ఆటో డ్రైవర్‌ను కొం దరు ఆకతాయిలు గాయపరిచిన ఘటనలో ఒకరిపై పాల్వంచ రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని రాజాపురంకు చెందిన కోరెం మధు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 16న ఆటో తోలకాలు ముగించుకుని ఊరిలోకి ప్రవేశించగా ప్ర ధాన సెంటర్లో కొందరు ఆకతాయిలు గోడవపడుతున్నారు. దీంతో ఆటో నిలిపి మధు వారికి సర్దిచెప్పడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో వారు అకారణంగా అతనిపై వాగ్వాదానికి దిగారు. అంతటితో ఆగకుండా వారిలో ఒకరైన నల్లబోతుల కొమరెల్లి పక్కనే ఉన్న కూల్‌డ్రింక్ ట్రేతో మధు తలపై బలంగా మోదాడు. బాధితుడు మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ హెడ్ కానిస్టేబుల్ హరిబాబు తెలిపారు.

పినపాకలో మీసేవ నిర్వాహకుడి నిర్బంధం



నాగబాబును చుట్టుముట్టిన స్థానికులు

తల్లాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇప్పిస్తానని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ ఆదివారం మండలం పినపాక గ్రామంలో మీసేవ నిర్వాహకుడు నాగబాబును స్థానికులు నిర్బంధించారు. పినపాక గ్రామంలో రైతుల భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇప్పిస్తానని, రైతుల ఫొటోలు, వేలిముద్రలు సేకరిస్తున్న మీసేవ నిర్వాహకుడు నాగబాబును స్థానికులు పట్టుకున్నారు. సెలవు రోజైన ఆదివారం అధికారుల అనుమతి లేకుం డా పినపాక గ్రామంలోని ఓ ఇంట్లో నాగబాబు పాస్‌పుస్తకాలు ఇప్పిస్తానని చెప్పి ఆన్‌లైన్ చేసేందుకు కొందరు రైతుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని స్థానికులు ఆరోపించారు. ఈమేరకు తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో పినపాకకు చెందిన 30మంది నాగబాబుపై ఫిర్యాదు చేశారు. పాస్‌పుస్తకాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడిన అతడిపై చర్యలు తీసుకోవాలని తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్ డిమాండ్ చేశారు.

తప్పిపోయిన యువతి ఆచూకీ లభ్యం

పాల్వంచ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ పట్టణ పరిధిలో ఈ నెల 16న తప్పిపోయిన యువతి(19) ఆచూకీని పాల్వంచ టౌన్ పోలీసులు ఆదివారం గుర్తించారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... ఇన్వెస్టిగేషన్‌లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సెర్చ్ ఆపరేషన్‌లో సదరు యువతి మరో యువకుడి(24)తో కలిసి ఉండగా పోలీసులు గుర్తించారు. వారిని పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో వారిరువురినీ వేరువేరుగా వాహనాల్లో తరలిస్తున్నారు. ప్రయాణంలో యువకుడు ఉన్న వాహనం పాల్వంచ చేరుకోవడానికి ఆలస్యం అయ్యింది. దీంతో యువకుడి బంధువులు, కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. అమ్మాయి, అబ్బాయిలు ఇద్దరూ పరస్పరం ఇష్టంతోనే కలిసి ఇంటినుంచి పారిపోయారని, కేవలం అబ్బాయిని పాల్వంచ స్టేషన్‌కు తరలించి, అమ్మాయిని హాజరుపరచలేదని, వారిని వేరు చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. పోలీసులు వారికి సర్ది చెప్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలోనే వారు డీఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. దీంతో విచారణ జరిపిన పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ ఇరువర్గాలకు నచ్చజెప్పి అక్కడ పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం ఈయన విలేకరులతో మాట్లాడుతూ 16వ తేదీన నమోదైన మిస్సింగ్ కేసులో యువతిని గుర్తించామని, మరో యువకుడు కూడా సదరు యువతితో ఉండటంతో వారి ఇరువురిని కోర్టులో హాజరుపరుస్తామని, కోర్టు ఆదేశాల మేరకు తగు చర్యలు చేపడతామని తెలిపారు. కాగా పోలీసులు ఆధీనంలో ఉన్న యువతిని మాత్రం కొత్తగూడెంలోని సఖీ సెంటర్‌కు తరలించనున్నట్లు తెలిపారు.



పాల్వంచ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న యువకుడి బంధువులు



వీధి వ్యాపార కేంద్రాలు ప్రారంభించాలి: కమిషనర్

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని ప్రధాన ప్రాంతాల్లో ఉన్న వీధి వ్యాపార కేంద్రాలను ప్రారంభించాలని అసిస్టెంట్ కమిషనర్ షఫి ఉల్లాను కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. ఆదివారం రోటరినగర్, ఇతర వీధి వ్యాపారులను కమిషనర్ పరిశీలించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో కేంద్రాలను పరిశుభ్రం చేయించారు. ఇటీవల రహదారి పక్కన వ్యాపారాలు చేస్తున్న వారిని తొలగించటం జరిగిందని, అటువంటి వారికి ఈ కేంద్రాల్లో దుకాణాలు పెట్టుకునేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రధాన రహదారుల పక్కన ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా వీధి వ్యాపారులను తరలించాలని ఆదేశించారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	40
బీరకాయ	50
పచ్చిమిర్చి	46
కాకరకాయ	48
బెండకాయ	34
పొట్లకాయ	48
దోసకాయ	24-48
చిక్కుడు	54
నాటుచిక్కుడు	90
గోరుచిక్కుడు	44
క్యాబేజీ	24
దొండ	44-60
సొరకాయ	20
క్యారెట్	44
క్యాప్సికం	58
ఆలుగడ్డ	34
ఉల్లిగడ్డ	40-45
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	105
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	గేంచేంజర్
శ్రీనివాస:	గేంచేంజర్
సాయిరాం:	గేంచేంజర్
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	గేంచేంజర్

21 నుంచి గ్రామ సభలు

నేలకొండపల్లి,జనవరి19(ఆంధ్రజ్యోతి):ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయటానికి ఈనెల 21 నుంచి 23వరకు మూడు రోజులపాటు గ్రామ సభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యం.యర్రయ్య ఓ ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్తరేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపై గ్రామసభలో చర్చించి అర్హులను ఎంపిక చేస్తారన్నారు. గ్రామసభల్లో ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు, అర్హత ఉండీ ఎంపిక కాని వారుగ్రామసభలో హెల్ప్‌డెస్క్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అర్హత కలిగిన వారికి పథకాలను వర్తింప చేస్తారని ఎంపీడీఓ ఆ ప్రకటనలో తెలిపారు.

శ్రీలక్ష్మీ తిరుపతమ్మ భక్తుల నగర సంకీర్తన

కామేపల్లి, జనవరి19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని టేకులతండాలో ఆదివారం శ్రీలక్ష్మితిరుపతమ్మ అమ్మవారి నగర సంకీర్తన నిర్వహించారు. శ్రీలక్ష్మి తిరుపతమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపును పెనగంచిప్రోలు ప్రధాన అర్చకులు మరిబోయిన సూరిబాబు ప్రారంభించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.ఈకార్యక్రమంలో గురుస్వాములు వెంకటగిరి రాంబాబు, కొమ్ము రామారావు, క్రిష్ణ, పుచ్చకాయల వంశీ, పవన్ భూక్య నరేష్ పాల్గొన్నారు.



44వ డివిజన్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో ఖమ్మంలో రూ.వందల కోట్ల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఖమ్మం 44వ డివిజన్ కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ పేర్కొన్నారు. ఆదివారం 44వ డివిజన్‌లో కార్పొరేటర్ దంపతులు విస్తృతంగా పర్యటించారు. 40మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మీ, షాదు ముబారక్ చెక్కులను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు.

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' నిబంధనలు సవరించాలని వినతి

ఖమ్మంటౌన్,జనవరి19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం నిబంధనలు సవరించి, జాతీయ ఉపాధిపథకంతో ముడిపెట్టకుండా లబ్ధిదారులను ఎంపిక చేయాలని వ్యవసాయ కార్మికసంఘం (బీకేఎంయూ అనుబంధం) నేతలు ఆదివారం జిల్లాకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందచేశారు.ప్రస్తుత నిబంధనల ప్రకారం అనేక మంది అర్హులకు పథకం అందదని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి తాటి వేంకటేశ్వరావు భట్టికి వివరించారు. ఉప ముఖ్యమంత్రి భట్టికి వినతిపత్రం ఇచ్చినవారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పగిడిపల్లి ఏసు, నాయకులు పెరుమాళ్లపల్లి ప్రకాష్‌రావు, తలారి రమేష్ తదితరులున్నారు.

రేపటి నుంచి డివిజన్ బహిరంగ సభలు

- మూడు రోజుల్లో పూర్తి
- ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల దరఖాస్తులకు మరో అవకాశం
- బహిరంగ సభల వద్ద కౌంటర్లు
- కార్యాచరణ పూర్తి చేసిన కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మఇళ్లు, కొత్తరేషన్‌కార్డులు సర్వే పూర్తి కావటంతో ఇక డివిజన్ స్థాయిలో బహిరంగ సభలను ఏర్పాటు చేయనున్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల తుదిజాబితాలను సిద్ధం చేయనున్నారు. ఇందుకోసం ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు కార్యచరణ రూపొందించారు. ఖమ్మం నగరంలోని 60 డివిజన్లలో ప్రజాపాలన దరఖాస్తుల మేరకు ఇందిరమ్మ ఇళ్లసర్వే, సమగ్ర కుటుంబ సర్వే దరఖాస్తుల మేరకు కొత్తరేషన్ కార్డుల సర్వేను కేఎంసీ అధికారులు పూర్తి చేశారు. కాగా సర్వేలో మాకు అన్యాయం జరిగిందని నిత్యం పదుల సంఖ్యలో కేఎంసీకి దరఖాస్తులు రావటంతో కార్పొరేటర్ల వినతుల మేరకు బహిరంగ సభల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల దరఖాస్తులను స్వీకరించనున్నారు.

21 నుంచి 23 వరకు సభలు

ఈనెల 21 నుంచి 23 వరకు ఖమ్మం నగర పాలక సంస్థలోని 60 డివిజన్లలో డివిజన్ బహిరంగ సభలను నిర్వహించనున్నారు. ప్రజాభిప్రాయ సేకరణతో లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేసేందుకు ఆదివారం ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య డివిజన్ షెడ్యూల్ ఖరారు. చేశారు. ప్రతిరోజు ఉదయం 8.30గంటలకు,11.30గంటలకు, మధ్యాహ్నం 2.30గంటలకు,సాయంత్రం 4 గంటలకు సభలు నిర్వహించనున్నారు. ప్రతి డివిజన్ బహిరంగ సభకు ఒక ప్రత్యేక అధికారిని ఒక వార్డు ఆఫీసర్, మరో ఇద్దరు ఉద్యోగులతో పాటుగా స్థానికంగా జవాన్, ఆర్పీలను నియమించారు. ఇందుకోసం ప్రత్యేక అధికారులుగా పట్టణ ప్రణాళిక అధికారి జీ వసుంధర, ఉద్యాన అధికారి బెల్లం రాధిక, ఎకౌంట్స్ అధికారి కే.శివలింగం,పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఇంజనీరింగ్ అధికారులు ధరణికుమార్, టీ.శ్రీనివాసులు, ఎం బాబు, కుమారస్వామి,నరేందర్‌తేజాను నియామకం చేశారు.

దరఖాస్తుకు మరో అవకాశం

ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసిన వారి జాబితాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దీంతో ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 200 మంది వరకు నిత్యం కేఎంసీ కార్యాలయం చుట్టూ ప్రదీక్షణలు చేస్తున్నారు. వీరిలో ఎక్కువగా ముస్లీం, మైనార్టీలు వారు ఉన్నారు. అలాగే సమగ్ర కుటుంబ సర్వేలో కొత్త రేషన్‌కార్డు లేదని చెప్పినా కూడా సర్వేకు రాలేదని పదుల సంఖ్యలో దరఖాస్తులు కేఎంసీ కార్యాలయానికి చేరుతున్నాయి. స్థానిక కార్పొరేటర్లు సైతం ఇవే విషయాలపై నిత్యం మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్యకు వినతులు అందిస్తున్నారు. 21నుంచి 23 వరకు నిర్వహించే డివిజన్ బహిరంగ సభల వద్దనే ప్రత్యేకంగా రెండు కౌంటర్లును ఏర్పాటు చేస్తున్నారు. ఇందిరమ్మఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులు, రేషన్‌కార్డులో మార్పులు చేర్పులపై దరఖాస్తులను స్వీకరిస్తారు. వీటిని మరో విడతలతో సర్వే నిర్వహించి అర్హత కలిగిన వారికి ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తారు.

ఏ డివిజన్‌లో ఏరోజు..

21న..(మంగళవారం)

ఈనెల21న ఉదయం 8.30కు 1,2,3,4,5వ డివిజన్ల బహిరంగ సభలు నిర్వహిస్తారు. 11.30గంటలకు 6,7,8,9,10 డివిజన్ల సభలు జరగనున్నాయి. మధ్యాహ్నం2.30గంటలకు 11,12,13,14,15డివిజన్ల సభలు, సాయంత్రం 4గంటలకు 16,17,18,19,20 డివిజన్ల సభలు జరుగుతాయి.

22న(బుధవారం)..

22నఉదయం 8.30గంటలకు 21,22, 23,24,25 డివిజన్లు బహిరంగ సభలు ఏర్పాటు చేశారు. 11.30గంటలకు 26, 27, 28,29,30 డివిజన్ల సభలు జరుగుతాయి. మధ్యాహ్నం 2.30గంటలకు 31,32,33, 34,35 డివిజన్ల సభలు, సాయంత్రం 4గంటలకు 36, 37, 38, 39, 40 డివిజన్ల బహిరంగ సభలు ఏర్పాటు చేశారు.

23న(గురువారం)..

23న ఉదయం 8.30గంటలకు 41, 42, 43, 44, 45 డివిజన్ల సభలు, 11.30గంటలకు 46, 47, 48, 49, 50 డివిజన్ల బహిరంగ సభలు ప్రకటించారు. మధ్యాహ్నం 2.30గంటలకు 51, 52, 53, 54, 55 డివిజన్ల సభలు, సాయంత్రం 4గంటలకు 56, 57, 58, 59, 60 డివిజన్లలో బహిరంగ సభలను పూర్తి చేయనున్నారు.

వెంకన్నకు ఘననివాళి

తిరుమలాయపాలెం, జనవరి19 (ఆంధ్రజ్యోతి): మండల సీపీఎం పార్టీనాయకులు పాపాయిగూడెం గ్రామానికి చెందిన రేపాకుల వెంకన్నకు ఆదివారం ఘననివాళులర్పించారు. శనివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా పాపాయిగూడెంలో సంతాపసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పూలమలాలువేసి నివాళులర్పించారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకురాలి మృతి

తిరుమలాయపాలెం,జనవరి19 (ఆంధ్రజ్యోతి):మండలంలోనితిమ్మక్కపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు చుంచు స్వరూప(50) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. ఆమెభౌతికకాయాన్ని పాలేరు నియోజకవర్గ ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, తాటికొండ కిరణ్,మాజీసర్పంచ్ సంద్ర వెంకన్న, పత్తి నాగేశ్వరరావు, బెల్లం రమేష్, నాగరాజు, సిరిగద్దె ఉపేందర్ నివాళులర్పించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఖమ్మంటౌన్,జనవరి19 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో 1990-91లో పదోతరగతి చదివిన విద్యార్థులు 24ఏళ్ల తరువాత కలుసుకున్నారు. నగరంలోని హోటల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.నాటి ఉపాధ్యాయులు ఆళ్ల రామారావు,సూర్యనారాయణ సింగ్, వేగినాటి లక్ష్మయ్యతో సహా పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు కోటి పూర్ణచంద్రరావు, పి.రామారావు, కాంతారావు, రాయల వాసరయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి

- అదనపు కలెక్టర్ శ్రీజ

తిరుమలాయపాలెం, జనవరి19 (ఆంధ్రజ్యోతి) పథకాల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని జల్లేపల్లి, మహ్మదాపురం, వెదుళ్లచెరువు తదితర గ్రామాల్లో పర్యటించారు. సాగుకు యోగ్యంకాని భూముల వివరాలను సర్వే చేపట్టాలని ఎటువంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఏవిధమైన అపోహలకు తావ్వివకూడదని చెప్పారు. రైతుభరోసాకు సంబంధించిన భూముల వివరాలను సమగ్రంగా సర్వే చేపట్టాలన్నారు. అనర్హులకు పథకాలు అందితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమలో తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఏవో సీతారాంరెడ్డి, ఆర్ఐ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



మహ్మదాపురంలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తిరుమలాయపాలెం, జనవరి19 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 80మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను ఆదివారం కాంగ్రెస్ నాయకుడు తుంబూరు దయకరరెడ్డి, మద్దినేని బేబి స్వర్ణకుమారి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ,మాజీ జడ్పీటీసీ బెల్లం శ్రీను, ఏఎంసీ డైరెక్టర నగేష్, యన్నం సుధాకర్‌రెడ్డి, ఆర్.అరవిందరెడ్డి, ఎం.విక్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

ఖమ్మంరూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బారుగూడెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వడ్డే శ్రీనివాస్‌రావు కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ శనివారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాస్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, మాజీ జెడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, మాజీ డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, స్థానిక నాయకులు పావురాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ మెంటారింగ్ సభ్యుడిగాప్రభాకరరెడ్డి

తిరుమలాయపాలెం,జనవరి19(ఆంధ్రజ్యోతి):తిరుమలాయపాలెం ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పెసల ప్రభాకరరెడ్డి నేషనల్ మెంటారింగ్ సభ్యుడిగా ఎంపికయ్యారు. నూతన విద్యావిధానం అమల్లో భాగంగా ఎన్‌సీటీఈ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నేషనల్ మిషన్ ఆఫ్ మానిటరింగ్ సభ్యుడుగా ఎంపికయ్యారు.

పారిశుధ్య పర్యవేక్షకుడికి షోకాజ్

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి19(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ జరుగుతుండగా వాటిని పర్యవేక్షణ చేయాల్సిన అధికారి కనీస సమాచారం లేకుండా స్వగ్రామానికి వెళ్లటంపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బాధ్యతలు నిర్వహిస్తున్న సాంబయ్య పైస్థాయిలోని అధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండా వెళ్లారు. దీంతో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ నిర్వాహణకు ఇబ్బంది కలగటంతో కమిషనర్ అభిషేక్ స్పందించారు. సాంబయ్యకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మరో మూడు రోజుల్లో రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని నోటీసులో కోరారు.

టీఎన్జీవో అధ్యక్షుడికి అభినందనల వెల్లువ

ఖమ్మంకలెక్టరేట్, జనవరి19 (ఆంధ్రజ్యోతి): టీఎన్జీవో అధ్యక్షుడిగా ఎన్నికైన గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. ఆదివారం ఆయన నివాసంలో కార్యవర్గ సభ్యులు పుష్పగుచ్ఛాలతో, శాలువాలతో సత్కరించారు. టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, టీజీవో జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ తదితరులు కూడా నూతన అధ్యక్ష కార్యదర్శులను అభినందించారు.

తెలంగాణ సంక్షేమాధికారుల సంఘం..

ఖమ్మంసంక్షేమవిభాగం: గుంటుపల్లి శ్రీనివాస్‌రావు, బుల్లెట్ శ్రీనివాసరావును తెలంగాణ సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొటపాటి రుక్మారావు ఆధ్వర్యంలో అభినందించారు. ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన కార్యక్రమంలో సంక్షేమాధికారులు పుష్పగుచ్ఛాలను అందించారు. సంక్షేమాధికారులు విజయ, శంకర్, వీరన్న పాల్గొన్నారు.

గౌడ కులస్థులను ఆదుకోవాలి

తెలంగాణ గౌడసంఘం రాష్ట్రకోశాధికారి వంగా రవిశంకర్‌గౌడ్

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న గౌడకులస్థులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్రకోశాధికారి వంగా రవిశంకర్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని సంఘం కార్యాలయంలో గౌడసంఘం కార్యవర్గ ప్రమాణస్వీకారానికి ఆయన హాజరయ్యారు. ఏళ్లతరబడిగా గౌడకులస్తులు తీవ్ర వెనుకబాటుతనానికి గురవుతున్నారని, పాలకులు వారిని ఏనాడు పట్టించుకన్న పాపాన పోలేదని తెలిపారు. త్వరలోసంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ సహకారంతో జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల సహకారంతో కల్యాణమండపం, హాస్టల్ నిర్మాణానికి శంకస్థాపన ఉంటుందని తెలిపారు. ఈసందర్భంగా నగరంలోని పలువురు గౌడసామాజిక వర్గానికి చెందిన వైద్యులను సన్మానించారు. తెలంగాణ గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి నెహ్రూ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో తెలంగాణ గౌడసంఘం సీనియర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతలపాటి వెంకటేశ్వరరావుగౌడ్, డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, దూసరి శ్రీరాములుగౌడ్, బండి నాగేశ్వరరావుగౌడ్ చిత్తలూరి నర్సయ్యగౌడ్, బొల్లికొండ దర్గయ్యగౌడ్, ఉమామహేశ్వరగౌడ్ పాల్గొన్నారు.



వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

వాటర్ క్యాన్‌కు చిక్కిన కుక్క

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): దాహంతో ఉన్న ఓ కుక్క వాటర్ క్యాన్ అడుగున ఉన్న నీటిని తాగుందుకు వెళ్లి క్యాన్‌లోపల మూతి ఇరుక్కుపోయింది. తీవ్ర ఇబ్బందికి గురి కావటంతో స్థానికుల సమాచారంతో కేఎంసీ డాక్ క్యాచర్ బృందం సభ్యులు వెళ్లి కుక్కకు ఉపశమనం కలిగించారు. ఖమ్మం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వాహన పార్కింగ్ ప్రాంతంలో ఓ కుక్క నిత్యం తిరుగుతుంటుంది. అయితే ఆదివారం కుక్కకు దాహం వేయటంతో పార్కింగ్ ప్రాంతంలో ఉన్న వాటర్ క్యాన్‌లో నీళ్ల తాగేందుకు మూతి, తలను పెట్టింది. క్యాన్ భాగం కుక్క మెడ వరకు వెళ్లింది. దీంతో కుక్క తన తలను బయటకు తీసేందుకు తీవ్ర ఇబ్బంది పడింది. ఏం చేయాలో పాలుపోక పార్కింగ్ వాహనాలపై దూసుకెళ్లింది. దీంతో అక్కడ ఉన్న డ్రైవర్లు కేఎంసీలోని డాగ్‌క్యాచర్ బృందానికి సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి కుక్కను వలతో బంధించి మూతికి ఉన్న వాటర్ క్యాన్‌ను తొలగించారు.



ఇంటింటికీ ప్రభుత్వ పథకాల ప్రచారం

ఏఎంసీ చైర్మన్ యర్రగర్ల, మండల కాంగ్రెస్ కమిటీ

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఇంటింటికి ప్రచారం చేయాలని ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యర్రగర్ల హనుమంతురావు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆత్మకమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, మండల కాంగ్రెస్ అడహాక్ కమిటీ కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్‌లతో సమావేశమయ్యారు. సంక్షేమ పథకాలపై ప్రచారం కల్పించాలని నిర్ణయించారు.మంత్రి తుమ్మల చొరవతో మంజూరు జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులు పంపిణీపై కార్యచరణ చేశారు.మండల కాంగ్రెస్ అడహాక్ కమిటీ సభ్యులు రెంటాల ప్రసాద్, దరావత్ రాంమూర్తి నాయక్, చేరుకూరి పూర్ణచంద్రరావు, భూక్యా బాలాజీనాయక్, తేజావత్ వెంకన్న, బండి వెంకన్న, కేలోత్ దేవ్‌సింగ్‌నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యర్రగర్ల, వాంకుడోత్ దీప్లానాయక్

సిగ్గులేని రాజకీయాలు చేసేది తాతా మధు

కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అమ్మ ఫౌండేషన్ సంస్థను ఏర్పాటు చేసి ఎన్నోఏళ్లుగా ప్రజా సేవ చేస్తున్న మల్లు నందినిపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు సిగ్గు లేని రాజకీయాలు చేస్తున్నారని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య హెచ్చరించారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మల్లు నందినిపై తాతా మధు చేసిన వ్యాఖ్యాలను ఖండించారు. కేసీఆర్ మనవడు హిమన్షు ఏ హోదాలో భద్రాచలం దేవాలయంలో తలంబ్రాలు అందించారని, కేసీఆర్ కూతురు కవిత ఏ హోదాలో జాగ్రతి కార్యక్రమాలు నిర్వహించి వందల కోట్లు ఖర్చు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తోందని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో నియంతృత్వ పరిపాలన కొనసాగిందని ఆరోపించారు. నాయకులు ఏలూరి రజిని, అనూష, ఊరుకొండ చంద్రిక, భవాని, స్వరూప, రమాదేవి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దొబ్బల సౌజన్య

లబ్ధిదారులకు ప్రయోజనం కలిగించాలి

గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంకలెక్టరేట్,జనవరి19(ఆంధ్రజ్యోతి):ఇందిరమ్మరాజ్యంలో ప్రతీ పేద వారి జీవితంలో వెలుగులు నింపేందుకు ఈ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని.. ఉద్యోగులు లబ్ధిదారులకు ప్రయోజనం కలిగించేలా కృషిచేయాలని రెవెన్యూ గృహనిర్మాణశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో మినిస్టర్ క్వార్టర్స్‌లో ఉద్యోగుల డైరీ, క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆరు గారెంటీలు పథకాలను అమలుచేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతానికి గృహనిర్మాణ సంస్థ సిబ్బంది అంకితభావంతో పని చేయాలని మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొగ్గుల వెంకట రామిరెడ్డి,సీనియర్ నాయకులు కంది రవీందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి,కుమార్,రమేష్,రఘు,లింగయ్య,సురేష్ తదితరులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి

మహా ప్రదర్శన విజయవంతం చేయండి

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వెంకన్నమాదిగ

నేలకొండపల్లి,జనవరి19(ఆంధ్రజ్యోతి):ఫిబ్రవరి7న హైదరాబాద్‌లో జరుగనున్న వేలగొంతులు, లక్షడప్పుల మహాప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నేలకొండల్లి మండల అధ్యక్షుడు మాదాసు వెంకన్న మాదిగ పిలుపునిచ్చారు. మహా ప్రదర్శనను జయప్రదం చేయాలంటూ ప్రచారం చేస్తున్న ప్రచార రథం ఆదివారం నేలకొండపల్లి చేరుకున్న సందర్భంగా ఎమ్మార్పీఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి.ఎస్సీ వర్గీకరణ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాప్రదర్శనను విజయవంతం చేయాలని వెంకన్నమాదిగ కోరారు. సుప్రీం తీర్పునుగౌరవిస్తూ 59 ఉపకులాలకు రాజ్యాంగ బద్దంగా వర్గీకరణను వర్తింపచేయాలి వెంకన్న మాదిగడిమాండ్ చేశారు. కార్యక్రమంలో పొట్టపింజర బాలస్వామి, తోళ్ళ వెంకన్న, తోళ్ళ సురేష్, వడ్లమూడి హనుమంతరావు, పెద్దపాక విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు



నేలకొండపల్లి చేరుకున్న ఎమ్మార్పీఎస్ ప్రచారరథం

పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్యను పెంచాలి

» డీఎంహెచ్‌వో కళావతిబాయి



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

మధిర రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్యను పెంచేలా చూడాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాణోతు కళావతిబాయి అన్నారు. ఆదివారం మధిర మండలం దెందుకూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, హాజరు వివరాలు, పీహెచ్‌సీకి వచ్చే ఓపీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి పృథ్వీరాజ్ నాయక్, వైద్యులు దివ్యశృతి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించండి



విరాళం అందిస్తున్న దాతలు

సత్తుపల్లిరూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకాపురిలోని 7వ లైన్‌లో నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి సహకరించాలని నిర్వాహకులు కోరారు. దేవాలయ నిర్మాణానికి భీమిరెడ్డి రవీంద్రరెడ్డి, విజయ, నిశాంత్ సాయిరెడ్డి, శ్రావణి, సత్యనారాయణ, సుగుణావతి తదితరులు ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. దాతలు ముందుకు వచ్చి సహకరించాలని, మిగతా వివరాలకు 77026 79077 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మెరుగైన సమాజం కోసం ఆశయాలను పంచాలి

» పల్లె ప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షుడు పల్లా కొండలరావు

బోనకల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మెరుగైన సమాజం కోసం ప్రతి ఒక్కరు పిల్లలకు ఆస్తి కన్నా ఆశయాలను పంచాలని పల్లె ప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షుడు పల్లా కొండలరావు సూచించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ ఆశయం కోసం నిరంతరం శ్రమించడమే అసలైన విజేతల లక్ష్యమన్నారు. ఫలితంతో సంబంధం లేకుండా ప్రయత్నాన్ని మాత్రం కొనసాగించాలన్నారు. ఆశకు గమ్యం ఉంటే ఆశయానికి ప్రయాణం మాత్రమే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, జొన్నలగడ్డ సునిత, తెల్లాకుల శ్రీనివాసరావు, గుగులోతు రామకృష్ణ, పిల్లలమర్రి అప్పారావు, గురవయ్య, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ భారవి

వైరా, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బోడేపూడి కళానిలయం ప్రతినెలా మూడో ఆదివారం నిర్వహిస్తున్న 115వ నెల వైద్యశిబిరం విజయవంతమైంది. ప్రముఖ వైద్యులు చీకటి భారవి, జట్ల రంగారావు, పిల్లలమర్రి సుబ్బారావు రోగులను పరీక్షించి, నెలరోజులకు సరిపడా మందులను రూ.100కు అందజేశారు. డాక్టర్లు విక్రమ్‌సింగ్, శ్రీకాంత్, ప్రశాంత్, పాషా కంటి పరీక్షలు నిర్వహించారు. నిర్వాహకులు బొంతు రాంబాబు, సమత, సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, తోట నాగేశ్వరరావు, గుడిమెట్ల రజిత, మోహన్‌రావు, కొంగర సుధాకర్, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రజిని, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు మునిసిపల్ పాలకవర్గ చివరి సమావేశం

వైరా, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ ప్రస్తుత పాలకవర్గ చివరి సమావేశం సోమవారం జరగనుంది. మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అధ్యక్షతన ఉదయం 10.30గంటలకు ఈ సమావేశం జరుగుతుందని కమిషనర్ చింతా వేణు తెలిపారు. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు

» ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
» పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
» మరమ్మతులు చేపట్టాలని స్థానికుల వినతి



గుంతలమయంగా మారిన మర్లపాడు వెళ్లే రోడ్డు

వేంసూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్లపాడు ప్రధాన సెంటర్ నుంచి జడ్పీఉన్నత పాఠశాల వరకు కిలోమీటర్ పొడవు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అధ్వానంగా తయారైన ఈ రోడ్డు గురించి ప్రజలు అనేకమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులతోపాటు భీమవరం, కందుకూరు గ్రామాలకు వెళ్లే ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాల సమయంలో ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి ద్విచక్రవాహన చోదకులు పలు ప్రమాదాలకు గురైన సంఘటనలు కోకొల్లలున్నాయి.

రాత్రుల సమయంలో ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు

● పిల్లి భాస్కర్, మర్లపాడు



మర్లపాడు రహదారిలో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. రహదారికి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

హెల్ప్‌డెస్క్‌ద్వారా దరఖాస్తుల స్వీకరణ



కొణిజర్లలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో రాంబాబు

» డీఎల్‌పీవో రాంబాబు

కొణిజర్ల, జనవరి19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో కూడ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని అర్హులు ఉంటే దరఖాస్తులు చేసుకోవచ్చని డీఎల్‌పీవో రాంబాబు తెలిపారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం పథకాలపై మండలాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 23 వరకు గ్రామాలలో గ్రామసభలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రోజారాణి, తహసీల్దార్ రాము, ఎంపీవో రాజేశ్వరి, ఏవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బోనకల్‌లో..

బోనకల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి 23 వరకు మండలంలో గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో ఆర్. రమాదేవి, తహసీల్దార్ ఎ. పున్నమ్ చందర్, ఏవో వినయ్ కుమార్‌లు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం గ్రామాల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 21వ తేదిన లక్ష్మీపురం, జానకీపురం, చిన్నబీరవల్లి, గార్లపాడు, రామాపురం, పెద్దబీరవల్లి, బ్రాహ్మణపల్లి, రాయనపేట, 22వ తేదిన తూటికుంట్ల, ఆళ్లపాడు, నారాయణపురం, సీతానగరం, కలకోట, మోటమర్రి, ముష్టికుంట్ల, 23వ తేదిన గోవిందాపురం(ఎ), రావల్లి, చొప్పకట్లపాలెం, రావినూతల, బోనకల్, చిరునోముల, గోవిందాపురం(ఎల్) గ్రామాలలో గ్రామసభలు నిర్వహించేలా దిశానిర్దేశం చేశారు.



బోనకల్‌లో మాట్లాడుతున్న అధికారులు



మధిరటౌన్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ రాంబాబు

మధిరటౌన్‌లో..

మధిరటౌన్, జనవరి19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలకు ఈనెల21 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే గ్రామసభల్లో లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని తహసీల్దార్ ఆర్. రాంబాబు తెలిపారు. ఆదివారం మధిర తహసీల్దార్ కార్యాలయంలో పథకాల ఎంపిక ప్రక్రియను వెల్లడించారు. మండలంలో 120 ఎకరాల వ్యవసాయేతర భూమిని గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, వ్యవసాయ అధికారి సాయికృష్ణ పాల్గొన్నారు.

తల్లాడలో...

తల్లాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నాలుగు పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల 21నుంచి తల్లాడ మండలంలోని 27గ్రామపంచాయతీల్లో గ్రామసభలు జరుగుతాయని ఎంపీడీవో ఎం.చంద్రమౌళి తెలిపారు. 21న అంబేద్కర్‌నగర్, అన్నారుగూడెం, ముద్దునూరు, బిల్లుపాడు, గొల్లగూడెం, కేశ్వాపురం, కొడవటిమెట్ట, 22న మిట్టపల్లి, రేజర్ల, బాలపేట, కలకొడిమ, రామచంద్రాపురం, మంగాపురం, లక్ష్మీపురం, మల్లవరం, నూతనకల్, 23న తెలగవరం, కొత్తవెంకటగిరి, కుర్నవల్లి, వెంగన్నపేట, తల్లాడ, రామానుజవరం, పినపాక, రంగంబంజర, గోపాలపేట, బస్వాపురం, మల్సూర్‌తండాల్లో గ్రామసభలు జరుగుతాయని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కల్లూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ప్రాంగణంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ 80 మందికి పైగా లబ్ధిదారులలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. అంతకు ముందు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల సౌకర్యార్థం ధాన్యాన్ని తూర్పార పట్టేందుకు ప్రభుత్వం తరఫున రూ.20 లక్షల అంచనాతో అందించిన ఆధునిక యంత్రాలను ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాదేవితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, లక్కినేని కృష్ణ, ఏనుగు సత్యంబాబు, బాగం ప్రభాకరచౌదరి, దారా రంగా, పెద్దబోయన శ్రీను, కీసర మధుసూధన్‌రెడ్డి, పాపబత్తిని నగేష్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను అందిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్

రోడ్డుపైనే పార్కింగ్

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు
» పట్టించుకోని అధికారులు

కల్లూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలో జాతీయ రహదారిపై చేపల మార్కెట్ వద్ద ద్విచక్ర వాహన దారులు తమ వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. స్థానిక మెయిన్ సెంటర్‌లో ఎన్‌హెచ్‌ఏఐ రహదారిపై అనుసంధానంగా చేపల మార్కెట్ విస్తరించింది. అయితే చేపల కొనుగోలుకు వస్తున్న వారు తమ వాహనాలను మార్కెట్‌కు దూరంగా పార్కింగ్ చేయకుండా ఇష్టారాజ్యంగా ఉంచడంతో ఈప్రదేశం ప్రమాదకంరగా మారింది. నిత్యం ఈ రహదారిపై వందల కొలది వాహనాలు తిరుగుతూ ఉంటాయి. ఇక మార్కెట్‌కు వచ్చిన చేపల మాంసం ప్రియులు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటించని పరిస్థితి. దీనికి తోడుగా చేపల విక్రయ దారులు కూడా తమకు ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇక ఆదివారం వస్తే కల్లూరు మండల నుంచే కాక జిల్లాలోని పలు మండలాల నుంచి ప్రత్యేకంగా వాహనాలపై వచ్చి చేపలు కొనుగోలు చేయించుకొని వెళ్లుతుంటారు. దీంతో వందలాది మంది చేపల కొనుగోలు దారులు తమ వాహనాలు ఇష్టారాజ్యంగా రహదారిపై మధ్య పార్కింగ్ చేయటంతో రహదారి విస్తీర్ణం తగ్గిపోతుంది. ఎస్ఐ హరిత దృష్టికి తీసుకోవెళ్లగా తగిన విధంగా చేపల మార్కెట్ వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీకుంటామని చెప్పారు.



రోడ్డుపైన నిలిపిన ద్విచక్ర వాహనాలు

'అర్హులైన వారికే పథకాలను వర్తింపజేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరావు

బోనకల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గ్రామసభలను పారదర్శకంగా నిర్వహించి అర్హులైన లబ్దిదారులకు మాత్రవే సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు డిమాండ్ చేశారు. మండలంలోని కలకోట గ్రామంలో ఆదివారం జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు మాతంగి శ్రీనివాసరావు, యంగల ఏలేష్, మత్స్య సొసైటీ చైర్మన్ బలుగూరి అచ్చయ్య, వెంకటమ్మ, చావా రామకృష్ణ, వసంత, ప్రభుదాసు తదితరులున్నారు.

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడిపై ఫిర్యాదు

వైరా, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్‌పై రాజద్రోహం కేసు నమోదు చేయాలని కోరుతూ వైరా మండల ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాలమహానాడు నాయకుల తీరును మార్చుకోకపోతే పీడిత వర్గాల సమాజం చేతుల్లో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఫిర్యాదులో హెచ్చరించారు. ఫిర్యాదు చేసిన వారిలో కోట నాగకోటేశ్వరరావు, కారుమంచి వెంకన్న, కరిశ రమేష్, మోదుగు రమేష్, కంచర్ల వెంకటేశ్వర్లు, ఇండ్ల వెంకటేశ్వర్లు, బాబూరావు ఉన్నారు.

'సమస్యను పరిష్కరించాలని వినతి'

కొణిజర్ల, జనవరి19(ఆంధ్రజ్యోతి): కాలనీలో ఉన్న రైస్‌మిల్లు నుంచి వచ్చే దుమ్ముధూళి వలన ఇబ్బందులు పడుతున్నామని, ఎటువంటి జాగ్రత్తలు పాటించడం లేదని పేర్కొంటూ ఆదివారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు కొణిజర్ల ఎస్సీ కాలనీకి చెందిన సీతారాములు, నాగయ్య, నాగ, భాస్కర్‌లు కొత్తగూడెంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీకాలనీ అతిదగ్గరలోనే సీఎంఆర్ రైస్‌మిల్లును ఉందని, దాని నుంచి వచ్చే దుమ్ముతో ఎలర్జీ, దగ్గు వస్తుందని వినతిలో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దాంతో ఎమ్మెల్యే పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఫోన్ చేసినట్లు వారు తెలిపారు.

రేషన్‌కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చండి

సత్తుపల్లిరూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సర్వే అనంతరం రేషన్ కార్డులలో కుటుంబ సభ్యుల పేర్లు జోడించాలని వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల, జాబ్‌కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాల బుచ్చయ్య, కువ్వారపు లక్ష్మణరావు, ఎలగం రాములు, ముత్తిని శ్రీను, దేవళ్ల రామారావు, బండి వేలాద్రి, హసావత్ కృష్ణ, సనందన్ రావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

వైరాలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పర్యటన



నగేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఆదివారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పర్యటించి ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వైరా మునిసిపాలిటీ 8వ వార్డు బ్రాహ్మణపల్లిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కన్నెగంటి నగేష్‌ను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆతర్వాత కమ్మవారి కల్యాణ మండపంలో జరిగిన దాసరాజు నాగకృష్ణ శ్రీనివాసరావు, అపురూప దంపతుల కుమార్తెలు సాయిశ్రీ హిత, సమన్విత శుభకార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మాజీ జడ్పీటీసీ బొర్రా ఉమాదేవి, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు కట్ల సంతోష్, పొదిల హరినాథ్, సీతరాములు,పాల్గొన్నారు.

'సమాజ పురోగతికి తోడ్పడిన ప్రజాకవి వేమన'



మాట్లాడుతున్న సృజన నిర్వాహకులు

సత్తుపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తన పద్యాలతో తెలుగు భాష వ్యాప్తికి, సమాజ పురోగతికి తోడ్పడిన ప్రజాకవి వేమన అని సృజన నిర్వాహకులు బీ.మధుసూదన రాజు, జీ.రామకృష్ణ అన్నారు. సంఘ సంస్కర్త యోగి వేమన జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఓ పాఠశాలలో ఆయన చిత్రపటానికి పుష్పలంకరణ చేసి నివాళి ఘటించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వేమన శతక పద్య పఠన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఆయన పద్యాలు జీవిత సత్యాలు, సువర్ణాక్షరాలుగానే కాక అనేక జీవిత సమస్యలకు పరిష్కార చూపుతున్నాయన్నారు. కార్యక్రమంలో నరుకుళ్ల సత్యనారాయణ, ఉపాధ్యాయులు శైలజ, మణి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోలేటి శ్రీనివాస్‌కు ఎమ్మెల్సీ తాతా, సండ్ర నివాళి



శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తాతా, సండ్ర

ముదిగొండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మల్లన్నపాలెం మాజీ సర్పంచ్ కోలేటి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయన చిత్రపటానికి ఆదివారం ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, బంకా మల్లయ్య, గడ్డం వెంకట్, పచ్చా సీతరామయ్య, కోటి అనంతరాములు, కోయ రమేష్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

» జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్



మాట్లాడుతున్న కమల్‌రాజ్

ముదిగొండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటి కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పాలని మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్ రాజ్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ముదిగొండ మండలం పమ్మి గ్రామంలో బీఆర్ఎస్ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు అందరికి హామీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం కొందరికే పథకాలు అమలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, గడ్డం వెంకట్, బంకా మల్లయ్య, కోటి అనంతరాములు, కోయ రమేష్, పచ్చా సీతరామయ్య, సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

» ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

చింతకాని, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు అన్నారు. మండల పరిధిలోని రాఘవాపురం గ్రామంలో ఏఐకేఎస్ గ్రామశాఖ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 75 శాతం మంది వ్యవసాయరంగంపై ఆధారపడి జీవిస్తున్నా, ఆ రంగానికి బడ్జెట్‌లో నిధులు తక్కువగా కేటాయించడం రైతులను విస్మరించడమేనన్నారు. కార్యక్రమంలో జమ్ముల జితేందర్‌రెడ్డి, పావులూరి మల్లికార్జున్, దూసరి గోపాలరావు, పదిమల వెంకటనర్సయ్య, అబ్బూరి మహేష్ పాల్గొన్నారు.

మల్లు నందినిపై బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలు సరికాదు

» నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షురాలు రమ



సమావేశంలో మాట్లాడతున్న చేబ్రోలు రమ

బోనకల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని పై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు చేసిన వ్యాఖ్యలు హేయకరమని మధిర డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షురాలు చేబ్రోలు రమ ఖండించారు. బోనకల్‌లో ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో నందిని పాల్గొన్నట్లు చూపిస్తారా? అని సవాల్ విసిరారు. స్వచ్ఛందంగా సేవా ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాల నిర్వహణతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలకు ఆపద సమయాల్లో ఆదుకునే తమ అభిమాన నాయకురాలి పై అసత్య ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. భట్టి చేస్తున్న అభివృద్ధికి బెంబేలెత్తుతున్న బీఆర్ఎస్ నాయకులు ఏం మాట్లాడాలో తెలియడం లేదని, తీరు మార్చుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఏసుపోగు హేమూన్, అవునూరి సత్యనారాయణ, శ్రీపాటి నాగరాజు, భూక్యా గోవిందు, తాళ్లూరి రాంబాబు, చేబ్రోలు రాజేష్, బోసిపోగు కృప తదితరులు పాల్గొన్నారు.